



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 251 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 19 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 251 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SUN 19 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## ముందు ఎన్సీపీ విలీనం.. తర్వాత ఎన్డీయేలోకి.. మహారాష్ట్రలో బీజేపీ మాస్టర్ ప్లాన్!

- ఎన్సీపీ విలీనంపై జోరుగా చర్చలు
- ముందు విలీనం.. తర్వాత ఎన్డీయే ఫార్ములా
- 15 రోజుల్లో తుది ప్రకటనకు అవకాశం
- విలీనం లేకపోతే ప్రత్యేకంగానే ఎన్డీయేలో చేరే ఛాన్స్
- అధ్యక్ష పదవిపై సునేత్రా పవార్ పట్టు



పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ) ఎన్డీయేలో చేరే అవకాశాలపై చర్చలు జరుగుతున్న వేళ.. ముందుగా ఎన్సీపీ రెండు వర్గాలు విలీనం కావాలనే

- మిగతా 2లో

## రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం

- ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందిస్తామన్న కోమటిరెడ్డి
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని వ్యాఖ్య
- పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్న మంత్రి



పెన్ పవర్ డెస్క్:తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు అనేవే లేకుండా చేస్తామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత పక్కా ఇల్లు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఆయన కొనియాడారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రూ. 184.15 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న

- మిగతా 2లో




- స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం
- భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్‌గా రికార్డు సృష్టి
- శ్రీహరికోట నుంచి నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్
- 'ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం చారిత్రాత్మకం
- ప్రధాని సందేశంతో పాటు పలు పేలోడ్లను కక్ష్యలోకి మోసుకెళ్లిన 'విక్రమ్-1'

భారత అంతరిక్ష రంగంలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశీయ ప్రైవేట్ స్పేస్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్, పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'విక్రమ్-1' ఆర్బిటాల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో వాణిజ్యపరంగా సొంతంగా ఆర్బిటాల్ రాకెట్లను అభివృద్ధి చేసి, ప్రయోగించిన అతికొన్ని దేశాల సరసన భారత్ నిలిచింది.

- మిగతా 2లో

**'మిషన్ ఆగమన్'**

భారత్ తొలి ప్రైవేట్ అంతరిక్ష ప్రయాణానికి రాకెట్ నాంది పలికింది. నాలుగు దశలు అనుకున్నట్టుగా పనిచేసి, తొలి ప్రయోగంలోనే ఉపగ్రహాలను కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఈ విజయం భవిష్యత్ ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగాలకు ఒక కొత్త మైలురాయిగా నిలిచింది.

**స్కైరూట్ ఏరోస్పేస్ ప్రయాణం**

- ఇస్రో మాజీ శాస్త్రవేత్తలైన పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా 2018లో సంస్థను స్థాపించారు.
- లక్ష్యం: చిన్న ఉపగ్రహాలకు తక్కువ ఖర్చుతో, నమ్మకమైన ప్రయోగ సేవలు అందించడం.
- 2022లో 'విక్రమ్-ఎస్' సబ్-ఆర్బిటల్ రాకెట్‌ను ప్రయోగించి తొలి భారతీయ ప్రైవేట్ సంస్థగా చరిత్ర సృష్టించింది.

ఈ విజయం భారత అంతరిక్ష యానంలో ప్రైవేట్ రంగానికి కొత్త శకం!

# 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు

- రాష్ట్రవ్యాప్తంగా రూ.15,274 కోట్ల పట్టణాభివృద్ధి పనులకు గుడివాడ నుంచి శ్రీకారం
- బూతులు తిట్టిన వారి నోళ్లను ప్రజలు తమ ఓట్లతో కడిగేశారన్న చంద్రబాబు
- అక్టోబర్ 2 నాటికి ఏపీని చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో అసభ్య పోస్టులను సహించేది లేదని హెచ్చరిక
- ఈ నెల 22 నుంచి "తల్లికి వందనం" కింద తల్లుల ఖాతాల్లో నిధులు జమ



పెన్ పవర్ డెస్క్:పరిశుభ్రమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బూతులు తిట్టిన వారి నోళ్లను ప్రజలు తమ ఓట్లతో కడిగేశారని ఘాటుగా వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా గుడివాడలో శనివారం జరిగిన 18వ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 120 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రూ.15,274 కోట్ల విలువైన ప్రజారోగ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అక్టోబర్ 2వ తేదీ నాటికి రాష్ట్రాన్ని కాలుష్య రహిత, చెత్త రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

స్వచ్ఛ రాజకీయాల కోసమే ఎన్టీఆర్ పార్టీ స్థాపన

దివంగత ఎన్టీఆర్ తొలిసారి ప్రజాక్షేత్రంలో నిలిచిన గుడివాడ నుంచే స్వచ్ఛ రాజకీయాలకు పునాది పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. స్వచ్ఛమైన రాజకీయాలు, స్వచ్ఛమైన ప్రజాప్రతినిధులు, తెలుగువారి ఆత్మగౌరవం అనే లక్ష్యాలతోనే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని తెలిపారు. గతంలో ఉన్న స్వార్థ రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధి, సంక్షేమానికి ఆయన శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి, సంపద సృష్టి లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. పరిశుభ్రత అంటే కేవలం రోడ్లు ఊడ్చడం కాదని, పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని కాపాడటమే అసలు లక్ష్యమని వివరించారు.

- మిగతా 2లో



## ఆగస్టు 1న చరిత్రలో నిలిచిపోయేలా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం

- భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు
- ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది మైలురాయి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- జీఎంఆర్ నిర్మించిన ఈ ప్రాజెక్ట్ తొలిదశ వ్యయం రూ. 4,592 కోట్లు
- తొలిదశలో ఏటా 63 లక్షల మంది ప్రయాణికులకు సేవలు

- మిగతా 2లో



## ధర్మేంద్ర ప్రధాన్ కాదు.. మోడీ రాజీనామా చేయాలి

### కాక్రోచ్ పార్టీ కొత్త డిమాండ్

పెన్ పవర్ డెస్క్: నీట్ పేపర్ లీక్, విద్యా వ్యవస్థలోని అక్రమాలకు నిరసనగా ప్రముఖ పర్యావరణ, విద్యావేత్త సోనమ్ వాంగ్ చుక్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేయడంపై కాక్రోచ్ జనతా పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష భగ్నం చేసినా మా ఉద్యమం ఆగదని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. సోనమ్ స్థానంలో మేం ఇక్కడే ఉంటాం.. ఇక్కడే మా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేసింది. ముందుగా చెప్పినట్లే జులై 20న తలపెట్టిన చలో పార్లమెంట్

- మిగతా 2లో

## గోదావరిలో గల్లంతైన ఐదుగురూ మృతి.. చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి

- పోలవరం జిల్లా ఎటపాక మండలంలో విషాదకర ఘటన
- గోదావరిన నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన గిరిజనులు
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న చంద్రబాబు
- ఈ ఉదంతం కలచివేసిందన్న పవన్



పెన్ పవర్ డెస్క్:పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు స్థానికులు

- మిగతా 2లో

## మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ

- గుంటూరులో మహిళపై టీడీపీ నేత దాడి ఘటనపై జగన్ ఆగ్రహం
- బుధవారం ఘటన జరిగితే మూడు రోజులు కప్పిపుచ్చారని ఆరోపణ
- ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని తీవ్ర విమర్శలు
- ఇదేనా సుపరిపాలన, మహిళా భద్రత అంటూ సర్కారుకు ప్రశ్నలు
- మహిళల ఆగ్రహం ప్రభుత్వానికి బుద్ధి చెబుతుందని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:గుంటూరులో ఒక మహిళను వివస్త్రను చేసి, టీడీపీ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ అని, రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ ఎంత ఘోరంగా

- మిగతా 2లో

## హైదరాబాదులో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన నారా లోకేశ్..

- గతంలో పవన్ భుజానికి గాయం
- ఇటీవల ముంబైలో విజయవంతంగా శస్త్రచికిత్స
- కొన్ని రోజుల కిందటే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి
- హైదరాబాదులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న వైనం
- పవనన్న త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన లోకేశ్



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం పరామర్శించారు. ఇటీవల ముంబ యిలో భుజానికి శస్త్రచికిత్స చేయిం చుకుని

- మిగతా 2లో

## బహదూర్‌గూడలో మళ్లీ ఉద్రిక్తత.. పోలీసులపై కారం చల్లిన రైతులు

- బహదూర్‌గూడలో భూసేకరణపై ఘర్షణ
- పోలీసులపై కారం చల్లి దాడి చేసిన రైతులు
- కానిస్టేబుళ్లు సహా పలువు పోలీసులకు గాయాలు
- 600 ఎకరాల భూముల స్వాధీనానికి వ్యతిరేకత
- ఐదు రోజులుగా రైతుల ఆందోళన కొనసాగింపు



పెన్ పవర్ డెస్క్:రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం భూసేకరణ వ్యవహారం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. భూములు స్వాధీనం చేసుకునేందుకు అధికారులు వెళ్లగా రైతులు అడ్డుకోవడంతో

- మిగతా 2లో

## గోదావరిలో ఐదుగురు గిరిజన మహిళలు గల్లంతు: ముగ్గురి మృతదేహాలు లభ్యం



పెన్ పవర్ డెస్క్:అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం దగ్గర గోదావరి నదిలో ఘోర ప్రమాదం జరిగింది. చేపలు పట్టడానికి వెళ్లిన ఐదుగురు గిరిజన మహిళలు నదిలో మునిగిపోయారు. నదిలో చేపలు పడుతున్న సమయంలో, నీళ్లు లోతుగా ఉన్న వైపు వెళ్లడం వల్లే వీరంతా కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది.

- మిగతా 2లో

# భారత అంతరిక్ష చరిత్రలో నవశకం.. తొలి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగం సక్సెస్

'మిషన్ ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం భారత ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ రాకను సూచిస్తుంది. తొలుత ఒక అంతర్గత సాంకేతిక సమస్య కారణంగా కొద్దిసేపు నిలిపివేసినా, ఆ తర్వాత రాకెట్ ప్రణాళిక ప్రకారమే నిప్పులు చిమ్ముతూ ఆకాశంలోకి దూసుకెళ్లింది. రాకెట్‌కు సంబంధించిన నాలుగు దశలు అనుకున్నట్టుగానే పనిచేయడమే కాకుండా ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టే ప్రక్రియ కూడా తొలి ప్రయత్నంలోనే విజయవంతమైంది. ఈ చారిత్రక విజయం స్కైరూట్ బృందంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

**'విక్రమ్-1' ప్రత్యేకతలు**

దాదాపు ఏడు అంతస్తుల ఎత్తు ఉండే విక్రమ్-1 రాకెట్‌ను పూర్తిగా కార్బన్ కాంపోజిట్ మెటీరియల్‌తో నిర్మించారు. ఇది 350 కిలోల బరువున్న పేలోడ్లను భూమికి సమీపంలోని కక్ష్య (లో ఎర్త్ ఆర్బిట్)లోకి మోసుకెళ్లగలదు. ఈ రాకెట్‌లో ఉపయోగించిన ప్రొపల్షన్ సిస్టమ్స్, అధునాతన 3డి-ప్రింటెడ్ ఇంజన్లు, హై-పెర్ఫార్మెన్స్ సాలిడ్ రాకెట్ మోటార్లు వంటి కీలక భాగాలన్నింటినీ స్కైరూట్ సంస్థే స్వయంగా అభివృద్ధి చేసింది.

ఈ తొలి ప్రయోగంలో గ్రాహ్ స్పేస్, కాస్మోసర్వ్, డీక్యూబ్డ్ వంటి సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు, స్కైరూట్‌కు చెందిన 'స్కోప్' ప్రయోగాన్ని కూడా పంపించారు. వీటితో పాటు కొన్ని ప్రత్యేకమైన వస్తువులను కూడా అంతరిక్షంలోకి పంపారు. వాటిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వదస్తూరితో రాసిన 'వందేమాతరం' పోస్ట్‌కార్డ్, ఇస్రో ప్రస్తుత, మాజీ చైర్మన్లు, భారత వ్యోమగాములు, స్కైరూట్ ఉద్యోగులు, పెట్టుబడిదారులు రాసిన సందేశాలు ఉన్నాయి. ఈ విజయం కేవలం రాకెట్ పనితీరును నిర్ధారించడానికే పరిమితం కాదు. అంతరిక్ష రంగంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ సంస్థలకు కూడా తలుపులు తెరుస్తూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు ఇది ఒక పెద్ద విజయంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రయోగం ద్వారా లభించిన కీలకమైన ఇంజినీరింగ్ డేటా, భవిష్యత్తులో విక్రమ్ సిరీస్ రాకెట్లను మరింత మెరుగుపరచడానికి, క్రమం తప్పకుండా వాణిజ్య ప్రయోగాలు చేపట్టడానికి స్కైరూట్‌కు సహాయపడుతుంది.

ఇస్రో మాజీ శాస్త్రవేత్తలైన పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా 2018లో స్కైరూట్ ఏరోస్పేస్‌ను స్థాపించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న చిన్న ఉపగ్రహాల మార్కెట్‌కు తక్కువ ఖర్చుతో, నమ్మకమైన సేవలు అందించడమే లక్ష్యంగా వారు ఈ సంస్థను ప్రారంభించారు.

2022లో 'విక్రమ్-ఎస్' అనే సబ్-ఆర్బిటాల్ రాకెట్‌ను ప్రయోగించి, అంతరిక్షంలోకి రాకెట్‌ను పంపిన తొలి భారతీయ ప్రైవేట్ సంస్థగా స్కైరూట్ ఇప్పటికే చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. తాజా విజయంతో భారత అంతరిక్ష యానంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ రంగం కూడా ఒక కీలక శక్తిగా నిలిచింది.

## ఎడిటర్ వ్యూ

## మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ

- మొదటి పేజి తరువాయి

విఫలమైందో చెప్పడానికి ఇది నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. ఈ దారుణానికి చంద్రబాబు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని ఆయన విమర్శించారు. ఈ ఘటన బుధవారమే జరిగినా, మూడు రోజులపాటు దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని, చివరకు ఆ వీడియోలు సోషల్ మీడియాలో బయటకు వచ్చి రాష్ట్ర ప్రజలంతా ఈ పరిపాలనను అసహ్యించుకున్న తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పుడు తానేదో గొప్పగా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడి చేయడం మరింత సిగ్గుచేటని అన్నారు. ఆ వీడియోలను కప్పిపుచ్చడంపై చూపిన శ్రద్ధను నిందితులను పట్టుకోవడంపై చూపలేదని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తనపై తొలిసారి దాడి జరిగిన వెంటనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించినప్పుడు వారు స్పందించి ఉంటే, ఆ తర్వాత ఇంతటి ఘోరం జరిగేది కాదు కదా అని ప్రశ్నించారు. ఆమె ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని ఉంటే ఈ దారుణం జరిగేదా? అని నిలదీశారు. ఫిర్యాదు చేసిన మహిళకు రక్షణ కల్పించకుండా మౌనం వహించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. "అసలు పోలీస్ స్టేషన్లు ఉన్నది ఎందుకు? బాధితుల ఫిర్యాదులను స్వీకరించడానికా? లేక అధికార పార్టీ నాయకులు ఏం చెబితే అది చేయడానికా? బాధితురాలికి అండగా నిలవకపోగా, పంచాయితీలు చేయడానికి ప్రయత్నిస్తారా? వీడియోలు బయటకు వస్తేనే చట్టం మేల్కొంటుందా? బాధితురాలి ఫిర్యాదుకు విలువ లేదా? నేరం జరుగుతున్నప్పుడు స్పందించకుండా, ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికిన తర్వాత చర్యల పేరుతో నాటకాలు ఆడటం ఏ రకమైన పోలీసింగ్? రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఈ చంద్రబాబు ప్రభుత్వం కావాలనే దాడులను ప్రోత్సహించింది. ఆ అరాచకాలను కప్పిపుచ్చడానికి పోలీసు వ్యవస్థను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకుంది. చట్టాన్ని అధికార పార్టీకి చుట్టంగా, ప్రతిపక్షాలపై వేధింపులకు, అక్రమ కేసులకు ఒక సాధనంగా మార్చి రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా దిగజార్చింది" అని ఆయన తీవ్రంగా విమర్శించారు.

అధికార పార్టీ నాయకులు ఏం చేసినా పోలీసులు రక్షిస్తారనే ధైర్యం ఈ రెడ్‌బుక్‌పాలనలో గ్రామాలు, వార్డుల స్థాయి వరకూ పాకిందని జగన్ అన్నారు. అందుకే టీడీపీ కూటమికి చెందిన పలువురు నాయకులు దుశ్శాసనుల్లా తయారయ్యారని మండిపడ్డారు. ఎలాంటి దారుణాలు చేసినా, ముఖ్యంగా మహిళలపై దాడి చేసినా, తమను కాపాడటానికి చంద్రబాబు ఉన్నారనే ధైర్యం వారిలో పెరిగిపోయిందని ధ్వజమెత్తారు.

ఈ పరిస్థితి రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా చేసిందని జగన్ ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల దురాగతాల నుంచి తమను తాము కాపాడుకోవాల్సిన దుస్థితికి మహిళల చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "చంద్రబాబు గారూ, ఇదేనా మీరు చెప్పే మహిళా భద్రత? ఇదేనా మీ సుపరిపాలన? ఇదేనా మీ పోలీసింగ్? మహిళల ఆగ్రహమే మీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతుంది" అని ఆయన హెచ్చరించారు.

## గోదావరిలో గల్లంతైన ఐదుగురూ మృతి.. చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి

- మొదటి పేజి తరువాయి

ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు ఇలా మృత్యువాత పడటం అత్యంత విచారకరమని, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే చంద్రబాబు అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేశ్ అనే ఐదుగురు ఈ దుర్ఘటనలో మరణించినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణమే అవసరమైన ఆర్థిక, నిత్యావసర సహాయ సహకారాలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ దారుణ ఉదంతం తనను తీవ్రంగా కలిచివేసిందనిపవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన పోలవరం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. ప్రభుత్వం తరపున వారికి ఎలాంటి లోటు రాకుండా సహాయ చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఆమె ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సాధారణంగా చేపల వేటకు వెళ్లే ప్రాంతంలో ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు తక్షణ ప్రభుత్వ సాయం అందేలా చూడాలని జిల్లా యంత్రాంగానికి స్పష్టం చేస్తూ... మృతుల కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆమె ఆకాంక్షించారు

## బహదూర్‌గూడలో మళ్లీ ఉద్రిక్తత.. పోలీసులపై కారం చల్లిన రైతులు

- మొదటి పేజి తరువాయి

పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆగ్రహానికి గురైన కొందరు రైతులు పోలీసులపై కారం చల్లి, రాళ్లు, కుర్చీలు విసురుతూ దాడికి దిగారు. ఈ ఘటనలో పలువురు కానిస్టేబుళ్లు, ఎస్ఐలు, సీఐలకు గాయాలయ్యాయి. గాయపడిన అధికారులకు చికిత్స అందించారు. డీసీపీకి కూడా గాయాలైనట్టు తెలుస్తోంది. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం సుమారు 600 ఎకరాల భూమిని సేకరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అయితే తమ భూములను ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వబోమంటూ రైతులు ఐదు రోజులుగా నిరసన కొనసాగిస్తున్నారు. తమకు స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతే భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

భూముల స్వాధీన ప్రక్రియ కోసం శనివారం ఉదయం హైడ్రా అధికారులు భారీ బందోబస్తుతో అక్కడికి చేరుకున్నారు. అధికారులు ముందుకు సాగేందుకు ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నారు. ఉదయం మొదలైన ఉద్రిక్తత సాయంత్రానికి మరింత తీవ్రరూపం దాల్చింది. పరిస్థితి చేదాటడంతో డీసీపీ యోగేశ్ గౌతమ్ రంగంలోకి దిగారు. వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇది ఆరంభం మాత్రమేనని, చర్చలు జరిపిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా కలెక్టర్‌కు విన్నవించుకునే అవకాశం కల్పిస్తారని చెప్పారు. రైతుల అనుమతి లేకుండా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోబోరని హామీ ఇచ్చారు. అయినప్పటికీ.. రైతులు వెనక్కి తగ్గలేదు. నిరసన కొనసాగిస్తామని భీష్మించారు.

## 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు

- మొదటి పేజి తరువాయి

**అక్టోబర్ 2 నాటికి చెత్త రహిత రాష్ట్రం**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 140 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని, దానిని తొలగించి ఇప్పుడు స్వచ్ఛ పథం, ఆపరేషన్ క్లీన్ స్వీప్ వంటి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని శుభ్రం చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. అక్టోబర్ 2 నాటికి రాష్ట్రాన్ని చెత్త రహితంగా మారుస్తామని ప్రకటించారు. దీనికోసం రూ.528 కోట్లతో వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే 8 ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ కోసం 126 ఎలక్ట్రిక్ ఆటోలను ప్రారంభించామని, త్వరలో మరో 1104 ఇ-ఆటోలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచే తడి, పొడి చెత్తను వేరుచేయాలని, 'నెట్ జీరో' వ్యర్థాల విధానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**తప్పు ఎవరు చేసినా ఉపేక్షించం**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, ప్రజలు సంతోషంగా జీవించే పరిస్థితి లేకపోయిందని చంద్రబాబు విమర్శించారు. రాజకీయాల్లో క్రిమినల్ ధోరణులు, కుట్రలు, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులతో ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్య పోస్టులు పెట్టి, ప్రశ్నిస్తే భావ ప్రకటనా స్వేచ్ఛ అనడం దారుణమన్నారు.

ప్రజల జీవితాలకు ఆటంకం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవడానికి వీల్లేదని, తప్పు చేసిన వ్యక్తి ఏ పార్టీకి చెందిన వారైనా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గుంటూరులో మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించిన టీడీపీ కార్యకర్తను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేసి అరెస్ట్ చేయించామని, శ్రీకాకుళం ఘటనలోనూ బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు**

తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా, పేదల పక్షాన నిలిచే మనసుందని అన్నారు. ఈ నెల 22 నుంచి 24 మధ్య "తల్లికి వందనం" పథకం కింద 67.47 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,122 కోట్లు జమ చేయనున్నట్లు ప్రకటించారు.

మరోవైపు, 12 ఏళ్ల క్రితం నీళ్లు లేక ఇబ్బంది పడిన కృష్ణా డెల్టాకు పట్టిసీమ ద్వారా 450 టీఎంసీల గోదావరి జలాలను అందించి రూ.50 వేల కోట్ల సంపద సృష్టించామని గుర్తుచేశారు. అక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తూ ఆదుకుంటున్నామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో భాగంగా గుడివాడ బస్టాండ్ అభివృద్ధికి అన్నే నరసింహారావు దంపతులు రూ.3 కోట్లు విరాళం ప్రకటించారు. సాయి శ్వేత అనే గృహిణి అమరావతి కోసం తన బంగారు గాజులను విరాళంగా ఇచ్చారు. వారిని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి, స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం

- మొదటి పేజి తరువాయి

రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పరిగి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు కీలక వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేద ప్రజలు సొంతంగా పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. త్వరలోనే అర్హులైన మిగతా వారందరికీ ఇళ్లు ఇచ్చేందుకు రెండో విడత కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో రోడ్ల నెట్‌వర్క్ బలోపేతం కోసం రూ.900 కోట్ల నిధులు మంజూరు చేయించామని, అందులో నుంచే పరిగి నియోజకవర్గానికి రూ.184.15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రవాణా వ్యవస్థ మెరుగైతేనే పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి తీరుతామని మాట ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి... నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని వివరించారు.

## ధర్మేంద్ర ప్రధాన్ కాదు.. మోడీ రాజీనామా చేయాలి

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమం చేసి తీరుతామని తేల్చిచెప్పింది.

ఈ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజిత్ దీప్కే మాట్లాడుతూ.. సోనమ్ వాంగ్ చుక్? దీక్షను భగ్నం చేసినంత మాత్రాన మా ఉద్యమం ఆగుతుందనుకుంటే అది వారి పొరపాటేనని అన్నారు. మేము ఇప్పటి వరకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాం.. కానీ శాంతియుతంగా చేస్తోన్న మా దీక్షను భగ్నం చేశాక ఇప్పుడు ప్రధాని మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామని దీప్కే పేర్కొన్నారు. మేం ఇక్కడే ఉంటాం.. సోనమ్ స్థానంలో దీక్షను యధావిధిగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జులై 20న తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమం విజయవంతం చేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ఎవరూ వెనక్కి తగ్గొద్దని.. పెద్ద ఎత్తున జంతర్ మంతర్?కు తరలిరావాలని మద్దతుదారులకు సూచించారు.

సోనమ్ వాంగ్ చుక్?ను దీక్షా శిబిరం నుంచి పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సీజేపీ మద్దతుదారులపై పోలీసులు విచక్షణరహితంగా ప్రవర్తించారని మండిపడ్డారు. శాంతియుతంగా చేస్తోన్న తమ దీక్షను భగ్నం చేసి ప్రభుత్వం పెద్ద తప్పు చేసిందని అన్నారు. మమ్మల్ని ఎంత అణగదొక్కాలని చూస్తే అంతకు రెట్టింపు వేగంతో మా ఉద్యమం మరింత విస్తరిస్తుందని హెచ్చరించారు.

## హైదరాబాదులో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన నారా లోకేశ్..

- మొదటి పేజి తరువాయి

హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కల్యాణ్‌ను లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా "పవనన్న త్వరగా కోలుకోవాలి" అని ఆయన ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. భుజానికి అయిన గాయం, జరిగిన శస్త్రచికిత్స వివరాలను అడిగారు. వైద్యుల సూచనల మేరకు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. తన పరామర్శ అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. "డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారిని పరామర్శించాను. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించాను. వైద్యుల సూచనలు పాటిస్తూ వీలైనంత మేర విశ్రాంతి తీసుకోవాలని సూచించాను" అని తెలిపారు. గతంలో భుజానికి గాయం కావడంతో పవన్ కల్యాణ్ కొంతకాలంగా ఇబ్బంది పడుతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో ఆయన కుడి భుజానికి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత ఆయన హైదరాబాద్‌లోనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి వచ్చి పరామర్శిస్తున్నారు.

### గోదావరిలో ఐదుగురు గిరిజన మహిళలు గల్లంతు:

## ముగ్గురి మృతదేహాలు లభ్యం

- మొదటి పేజి తరువాయి

ప్రమాదానికి గురైన వారంతా గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందినవారు. ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు, స్థానికులు కలిసి నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు ముగ్గురి మృతదేహాలు లభ్యమవ్వగా, మిగిలిన ఇద్దరి కోసం వెతుకులాట కొనసాగుతోంది. మరణించిన వారిని ఊకె సుశీల (37), ఊకె లక్ష్మి (37), తుర్రం భారతి (40), భాసుబోయిన బాలరాజు (38), ఊకె రమేష్ (38)గా గుర్తించారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు చనిపోవడంతో గొమ్ముకొత్తగూడెం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రస్తుతం మృతదేహాలను పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాక వారి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. కాగా, ఈ ప్రమాదంపై ఏపీ మంత్రి సంధ్యారాణి స్పందిస్తూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## ఆగస్టు 1న చరిత్రలో నిలిచిపోయేలా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోంది. విశాఖపట్నం సమీపంలోని భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో గత కొంతకాలంగా ప్రారంభోత్సవ తేదీపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. శనివారం సాయంత్రం విమానాశ్రయ నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన చంద్రబాబు, ఈ కీలక ప్రకటన చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలోని పర్యాటకం, పోర్టులు, జాతీయ రహదారులు, పారిశ్రామిక ప్రగతితో కలిసి ఈ ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రను 'అన్‌స్టాపబుల్' శక్తిగా మారుస్తుందని ఆయన పేర్కొన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం వద్ద, విశాఖ నగరానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి-16కు సమీపంలో సుమారు 2,200 ఎకరాల విస్తీర్ణంలో ఈ విమానాశ్రయాన్ని నిర్మించారు. ప్రఖ్యాత మౌలిక సదుపాయాల సంస్థ జీఎంఆర్ గ్రూప్‌కు చెందిన 'జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (+ఎ×ూూ)' ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. తొలి దశలో భాగంగా రూ. 4,592 కోట్ల వ్యయంతో ఎయిర్‌పోర్టును నిర్మించారు. మొదటి దశలో ఏటా 63 లక్షల (6.3 మిలియన్ల) మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యంతో టెర్మినల్ భవనాన్ని తీర్చిదిద్దారు. భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రెండో దశలో 1.2 కోట్లు, మూడో దశలో 1.8 కోట్ల మందికి విస్తరించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఈ ప్రాజెక్టు పలు ప్రభుత్వాల హయాంలో పురోగతి సాధించింది. 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2024 సెప్టెంబర్‌లో ఈ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా నామకరణం చేశారు. ప్రస్తుతం విశాఖ నగరంలోని ఐఎన్ఎస్ డేగా నేవల్ ఎయిర్‌బేస్ నుంచి కొనసాగుతున్న పౌర విమానయాన కార్యకలాపాలు దశలవారీగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు మారనున్నాయి. ఈ విమానాశ్రయం చుట్టూ 'ఏరోట్రోపాలిస్'ను అభివృద్ధి చేసే ప్రణాళికలు కూడా ఉన్నాయి. ఈ విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర పారిశ్రామిక, పర్యాటక రంగాలకు కొత్త ఊపు వస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ముందు ఎన్సీపీ విలీనం.. తర్వాత ఎన్డీయేలోకి.. మహారాష్ట్రలో బీజేపీ మాస్టర్ ప్లాన్!

- మొదటి పేజి తరువాయి

ఫార్ములాను బీజేపీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ అంశంపై రెండు వర్గాల మధ్య లోతైన చర్చలు జరుగుతున్నాయని.. 15 రోజుల్లో తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెప్పినట్లు 'న్యూస్18' పేర్కొంది. 2023 జులైలో ఎన్సీపీ చీలిపోయిన తర్వాత అజిత్ పవార్ వర్గం బీజేపీ-శివసేన ప్రభుత్వంలో చేరింది. ఈ ఏడాది బరామతి సమీపంలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించారు. అప్పటి నుంచి రెండు వర్గాల విలీనంపై మళ్లీ చర్చలు ఊపందుకున్నాయి. ఇటీవల ఎన్డీయే నేతలు, రెండు ఎన్సీపీ వర్గాల ప్రతినిధులు పలుమార్లు సమావేశమైనట్లు సమాచారం. ఒకవేళ విలీనం సాధ్యంకాకపోతే.. శరద్ పవార్ వర్గం ప్రత్యేక పార్టీగానే ఎన్డీయేలో చేరడం లేదా ప్రభుత్వానికి బయట నుంచి మద్దతు ఇవ్వడం వంటి ప్రత్యామ్నాయాలనూ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ వర్గానికి చెందిన ఎక్కువ మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు నేరుగా ఎన్డీయేలో చేరాలని కోరుకుంటున్నట్లు సమాచారం. కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వాల్లో భాగమైతే పార్టీ బలోపేతానికి ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారని తెలుస్తోంది. విలీనం జరిగితే పార్టీ అధ్యక్ష పదవిని సునేత్రా పవార్‌కు ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. అలాగే మహారాష్ట్ర ఆర్థిక శాఖ తమ వర్గానికే ఇవ్వాలని ఆమె పట్టుబడుతున్నారని, శరద్ పవార్ వర్గం కూడా అదే శాఖపై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు లోక్‌సభ స్థానాల సంఖ్య పెంపు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంట్‌లో మళ్లీ ప్రవేశపెట్టాలని ఎన్డీయే భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# అటకెక్కిన ఫాగింగ్ యంత్రాలు

**ఐదేళ్లు అవుతున్నా కొన్నిచోట్ల వినియోగించని వైనం దోమల వ్యాప్తితో అల్లాడుతున్న ప్రజలు**



మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలు ఫైల్ ఫోటో

**సీతానగరం, పెన్ పవర్, జూలై 18:** పంచాయతీల్లో అద్వాన పారిశుధ్యం అటకెక్కిన ఫాగింగ్ యంత్రాల వల్ల దోమల బెడద అధికమవుతుంది. చినుకుల కాలం మొదలవుతున్న నేపథ్యంలో సమర్థ చర్యలను గాడిలో పెట్టాల్సిన ఆవశ్యకత నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని 21 గ్రామ పంచాయితీలుండగా కొన్ని పంచాయితీలకు రూ. 38వేలు విలువచేసే ఫాగింగ్ యంత్రాలు మంజూరు చేశారు. వీటిని అందించి ఐదేళ్లు అవుతున్నా. ఇప్పటికీ చాలాచోట్ల వినియోగంలోకి తీసుకురాలేదు. అక్కడక్కడ అరకొర వాటిన తర్వాత వాటిని మూలకు చేర్చారు. వాతావరణం మార్పులతో అప్పుడప్పుడు కొద్దిపాటి చినుకులు రావడంతో దోమలు పెరుగుతున్నాయి. అదే సమయంలో డ్రైనేజీల్లో చెత్త పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో దోమల విజృంభణకు కారణమవుతోంది. అధికారులు స్పందించి పంచాయితీల్లో మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలను వినియోగంలోకి తీసుకురావడంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.






# ఆదివాసీ మహాగర్జన సభకు వేలాదిగా తరలిరావాలి

**జీవో నంబర్ 3 పునరుద్ధరించాలి.. 1/70 చట్టాన్ని పరిరక్షించాలి**

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ జూలై 18 :** ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 20న రంపచోడవరంలో నిర్వహించనున్న ఆదివాసీ మహాగర్జన సభకు గిరిజనులు, ఆదివాసీ ప్రజలు వేలాదిగా తరలిరావాలని ఆదివాసీ ముఖ్య నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం రంపచోడవరంలో ఈతపల్లి సిరిమల్లెరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఆదివాసీ ముఖ్య నాయకుల సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 24న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రంపచోడవరం పర్యటన సందర్భంగా ఆదివాసీల ప్రధాన డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలని, 1/70 చట్టాన్ని పటిష్టంగా పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల హక్కులు, రిజర్వేషన్లు, భూముల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న మహాగర్జన సభను విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు. సభలో ఆదివాసీల సమస్యలు, హక్కులు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు లోత రామారావు, మండల అధ్యక్షుడు బంధం శ్రీదేవి, తెల్లం శేఖర్, వంజం జోగారావు, బోండ్ల వరప్రసాద్, పల్లాల లింగారెడ్డి, మట్ల వాణిశ్రీ, సమర్త కృష్ణ, బి.మంగిరెడ్డి, గరిడే బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి





- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూలై 18:** రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ఏర్పాట్లను ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. ఈ నెల 24న రంపచోడవరంలో నిర్వహించనున్న మెగా పేరెంట్--టీచర్ సమావేశానికి ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో అధికారులతో ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్, ఆర్డీవో స్వాతి, ఓఎస్డీ జావలి తదితరులు సమావేశానికి హాజరై ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమయానుకూలంగా పూర్తి చేసి, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని ఆదేశించారు.

ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి వేదిక, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, అగ్నిమాపక సదుపాయాలు, పార్కింగ్, మీడియా, మరుగుదొడ్లు, తాత్కాలిక షెడ్లు తదితర ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఏర్పాట్లలో ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెలిప్యాడ్ ల్యాండింగ్ ప్రాంతంలో అనధికార వ్యక్తులను అనుమతించవద్దని పోలీసు అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణంలో ఎక్కడా లోపాలకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అల్లూరి సీతారామరాజు, సరస్వతి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించనున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు మూడు, నాలుగు తరగతుల విద్యార్థులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వాహనాల పార్కింగ్ కోసం ఏరియా ఆసుపత్రి ప్రాంగణం, సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణం, లెనోరా కళాశాల ప్రాంగణాలను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. వివిధ శాఖలు తమ ఏర్పాట్లకు సంబంధించిన చెక్‌లిస్ట్‌లు, నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. సభా ప్రాంగణం వద్ద ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. సీఎం పర్యటనకు వచ్చే ప్రజల కోసం ఎన్ని బస్సులు, ఆటోలు ఏర్పాటు చేస్తున్నారనే వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి పాసులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశానికి హాజరయ్యే ప్రజలకు భోజన సదుపాయం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అన్ని శాఖలు తమకు అప్పగించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వహించి, ఎప్పటికప్పుడు పురోగతి నివేదికలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్, ఆర్జేడీ నాగమణి, డిప్యూటీ డైరెక్టర్లు రుక్మాండయ్య, షేక్ మహమ్మద్ షరీఫ్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ దాసరి రత్నాకర్ రావు, పీడీ ఉపాధి బి.రాంప్రసాద్, డీపీఓ చంద్రశేఖర్, ఐసీడీఎస్ పీడీ కె.ఉమా, డీఈఓ శ్రీరామమూర్తి, ఏజెన్సీ డీఈఓ వై.మల్లేశ్వరరావు, డీసీహెచ్ఎస్ సాంబశివరావు, డీఎంహెచ్ఓ పి.సరిత, సబ్ డీఎఫ్ఓ అనూష, జిల్లా సివిల్ సప్లై అధికారి విజయభాస్కర్, డీడీఎంఓ గణేష్, తహసీల్దార్లు సీహెచ్.బాలాజీ, అమ్మాజీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్‌రావు, ఇంటర్మీడియట్ ఆర్జేడీ శేఖర్ బాబు, ఎంపీడీఓ ప్రసాద్, ఆర్టీసీ డీఎం మార్గరెట్, ఆర్టీవో రాజేష్ కుమార్, ఈఈలు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, ఏపీ ఈపీడీసీఎల్ ఏడీ మహంకాళేశ్వరరావు, సర్వే ఏడీ శ్రీనివాసరావు, పీహెచ్ఓ నరేంద్ర కుమార్, జీసీడీఎం విజయలక్ష్మి, డీఈలు భవాని, సుబ్బారావు, పి.వెంకటరమణ, సాలెంరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఐ యాక్ట్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్‌అదాలత్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూలై 18:** నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ (ఎన్ఐ) యాక్ట్‌కు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు రంపచోడవరం జేఎఫ్‌సీఎం కోర్టులో శనివారం ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రంపచోడవరం జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి మురళి గంగాధర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల పరిధిలోని ఎన్ఐ యాక్ట్ కేసులను పరస్పర అంగీకారం, రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్‌అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవడంతో సమయం, ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎం.వి.ఆర్. ప్రకాష్‌తో పాటు న్యాయవాదులు గౌరీశంకర్, లక్ష్మీనారాయణ, రవితేజ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


# చేపల వేటకు వెళ్లి ఐదుగురు మృతి.





**బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే శిరీషాదేవి**

**చింతూరు, పెన్ పవర్, జూలై 18:** ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా.. మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమైన ఎమ్మెల్యే. గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి మృతి చెందిన గొమ్ము కొత్తగూడెం గ్రామానికి చెందిన కుటుంబాలను రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పరామర్శించారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే ఆమె సంఘటనా స్థలానికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎటపాక మండలం గొమ్ము కొత్తగూడెం గ్రామానికి చెందిన 10 మంది గ్రామస్థులు గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లారు. ఈ క్రమంలో చేపల వేట చేస్తుండగా ప్రమాదవశాత్తు ఐదుగురు నదిలో మునిగి మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. మృతిచెందిన వారిలో ఉకే లక్ష్మి (37), ఉకే సుశీల (37), బసిబోయిన బాలరాజు (40), తుర్రం భారతి (40), ఉకే రమేష్ (37) ఉన్నారు. మృతదేహాలను చూసిన ఎమ్మెల్యే శిరీషాదేవి తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమయ్యారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మృతదేహాలకు త్వరగా పంచనామా, పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించాలని పోలీసు, వైద్య అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మృతులకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేపల వేట సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదకర పరిస్థితుల్లో నదిలోకి వెళ్లి ప్రాణాలను పణంగా పెట్టే చర్యలకు దూరంగా ఉండాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎటపాక టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా పుల్లయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి వల్లభనేని చందు, మండల ప్రధాన కార్యదర్శి కనితి మధు, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ మాచినేని రాజేష్, ఎంపీటీసీ పాయం దేవి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.






# చంద్రబాబు పర్యటనను విజయవంతం చేద్దాం

- పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేయాలి
- ప్రతి సమస్యను పరిష్కరిస్తా
- ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

**గంగవరం /రాజవొమ్మంగి, పెన్ పవర్ జూలై 18 :** ప్రజా క్షేత్రంలో నెలకొన్న ప్రతి సమస్యను పారదర్శకంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. శనివారం రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 24న రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని, పార్టీ పరంగా ఎలాంటి లోపాలకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ యంత్రాంగం తన బాధ్యతలను నిర్వహిస్తున్నప్పటికీ, పార్టీ పరంగా కూడా కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వం, పార్టీ తరఫున అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కూటమి శ్రేణులపై ఉందన్నారు. అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలు అందని వారికి వెంటనే పథకాలు అందేలా చూడాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ శాఖ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పార్టీ శ్రేణులు తన దృష్టికి తీసుకురావాలని, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆమె వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, జర్తా వెంకటరమణ రెడ్డి, గురుకు శేషుకుమార్, పొత్తూరి కాంతారెడ్డి, గోళ్ళ చంటిబాబు, పల్లాల వెంకటరెడ్డి, బొల్లా పుల్లయ్య, బొర్రా నరేష్ కుమార్, ఎడవల్లి భాస్కరరావు, షేక్ జమాల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత






- చెత్త రహిత జిల్లాగా పోలవరాన్ని తీర్చిదిద్దాలి
- కలెక్టర్ కె.దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూలై 18**: పోలవరం జిల్లాలోని ప్రతి గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రంపచోడవరం అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమాన్ని కలెక్టర్ కె.దినేష్ కుమార్, రంపచోడవరం ఎమ్మెల్యే, శాసనసభ్యుల లెజిస్లేటివ్ చైర్మన్ మిరియాల శిరీష దేవి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన కేంద్రాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాపారులు చెత్తను రోడ్లపై వేయకుండా ప్రతి ప్రాంతంలో చెత్తబుట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రహదారులకు ఇరువైపులా ఎక్కడా చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తడి, పొడి చెత్తను వేరు చేసి, సేంద్రియ వ్యర్థాలతో ఎరువు తయారు చేసే విధంగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. పోలవరం జిల్లాను చెత్త రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో స్వచ్ఛ రథాల ద్వారా ప్లాస్టిక్, పాత ఇనుము, అట్టలు తదితర వ్యర్థాలను సేకరించడం ద్వారా పరిసరాల పరిశుభ్రతకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బహిరంగ మల, మూత్ర విసర్జనకు స్వస్తి పలికి ప్రతి ఇంట్లో, సామూహిక మరుగుదొడ్లను వినియోగించాలని పిలుపునిచ్చారు. ప్రధాన రహదారులపై చెత్త వేస్తున్న వ్యాపారులకు ముందుగా నోటీసులు జారీ చేసి, ఆ తరువాత జరిమానాలు విధించాలని ఆమె అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని అన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెల మూడో శనివారం అన్ని మండలాల్లో స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వచ్ఛతపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సుభిక్షమైన, ఆనందకరమైన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య కార్మికులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా దుస్తులు, నిత్యావసర వస్తువులు అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులు ప్రధాన రహదారులపై పర్యటించి చీపుర్లు పట్టి రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, డీఎల్‌పీఓ రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ కె.బాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ హరిబాబు, పంచాయతీ కార్యదర్శి కామరాజు, ఇన్‌స్పెక్టర్ టి.జి.ఎన్.ప్రసాద్, స్థానిక నాయకులు అడబాల బాపిరాజు, వై.నిరంజని దేవి, పండ చెల్లన్నదొర, పీఆర్పీ శ్రీను, అనంత మోహన్, బుద్ధ వెంకన్నబాబు, షేక్ చోటు, కారం సురేష్, నక్క శివరామకృష్ణ, లక్ష్మీ, సలాది బాపిరాజు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగల బాలికల ఆశ్రమ పాఠశాలలో అడ్డతీగల సీఐ అవగాహన సదస్సు: బాలల భద్రత, సైబర్ నేరాలు పై ప్రత్యేక దృష్టి..






**అడ్డతీగల, పెన్ పవర్, జూలై 18;** అడ్డతీగల ఏపీటీడబ్ల్యూఏజీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం ఉదయం అడ్డతీగల సీఐ ఎం గజేంద్ర కుమార్, ఎస్ ఐ బి .వినోద్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు 'గుడ్ టచ్ – బ్యాడ్ టచ్' గురించి అవగాహన కల్పించి, వారి వ్యక్తిగత భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని, విద్యార్థులకు సూచించారు.

అంతేకాకుండా, మహిళా భద్రత, ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలు మరియు వాటి నుంచి ఎలా రక్షణ పొందాలీ అన్న విషయంపై వివరించారు. ముఖ్యంగా గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాలువంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని వక్తలు పిలుపునిచ్చారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని, పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంత మతి, ఉపాధ్యాయులు స్కూల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ అధికారులు







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 18:**డాక్టర్ వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులు ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వ్యవసాయ రంగంలో చేపడుతున్న అనుసరణ చర్యలను తెలుసుకునేందుకు శనివారం తూర్పు గోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, సింగరాజుపాలెం గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఎం. మాధవి, విస్తరణ సంచాలకులు డా. సీఎహ్. రూత్, పరిశోధన సంచాలకులు డా. ఎస్. సూర్యకుమారి పాల్గొని రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం వ్యవసాయంపై చూపుతున్న ప్రభావాలు, వాటిని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన శాస్త్రీయ మరియు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వారు అవగాహన కల్పించారు.

పరిశీలనలో భాగంగా మిశ్రమ వ్యవసాయ విధానం ద్వారా రైతులు వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు. అలాగే ఆధ్వర్యంలో అమలు చేస్తున్న గోల్డెన్ లిట్టర్ వినియోగం, నేల సారవంతత పెంపు, తేమ సంరక్షణ, సూక్ష్మజీవుల వృద్ధికి దోహదపడే ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు.

అదేవిధంగా డ్రమ్ సీడర్ ద్వారా వరి సాగు విధానాన్ని పరిశీలించి, విత్తన వ్యయం, శ్రమ వ్యయం తగ్గడంతో పాటు నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుందని అధికారులు తెలిపారు. రైతులకు అందజేసిన కిట్ల వినియోగం, వాటి ప్రయోజనాలను కూడా సమీక్షించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో సిబ్బంది, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారి మరియు శాఖ సిబ్బంది పాల్గొన్నారు. రైతులు వాతావరణ సూచనలను అనుసరిస్తూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, సమీకృత వ్యవసాయ విధానాలను అవలంబించడం ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని అధికారులు సూచించారు.

## వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తల అనుసంధాన వేదికే 'జగన్ 2.0 సూపర్ యాప్'






- జగన్ 2.0 సూపర్ యాప్ ను ప్రతి ఒక్కరూ డౌన్లోడ్ చేసుకోండి.
- పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన వడ్డీ రఘురామ్ నాయుడు
- పార్టీ శ్రేణులతో కలసి 'జగన్ 2.0 సూపర్ యాప్ ' ఆవిష్కరణ..

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 18;** వైయస్సార్ సీపీ నాయకత్వానికి, కార్యకర్తలకు మధ్య అనుసంధాన వేదికనే "జగన్ 2.0 సూపర్ యాప్" అని తాడేపల్లిగూడెం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అధ్యక్షులు వడ్డీ రఘురామ్ నాయుడు పేర్కొన్నారు. వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు జగన్ 2.0 సూపర్ యాప్ ను పార్టీ శ్రేణులతో కలసి వడ్డీ రఘురామ్ నాయుడు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వడ్డీ రఘురామ్ నాయుడు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి వైయస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తూ అణచివేసే ధోరణిలో వ్యవహరిస్తోందన్నారు. కూటమి కుట్రలను తిప్పికొడుతూ వైయస్సార్ సీపీ కార్యకర్తలకు, నాయకులకు మధ్య అనుసంధానంగా ఉండాలనే సదుద్దేశంతో "జగన్ 2.0 సూపర్ యాప్" ఏర్పాటు చేయడం జరిగిందని, కూటమి ప్రభుత్వం చేస్తున్న దురాగతాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ జగన్ 2.0 సూపర్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## శ్రీ కనక మహాలక్ష్మి ఆలయంకు గట్టిం విరాళం..





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్ జూలై 18:**ఆలయాల కు దాతల ప్రోత్సాహం అవసరం అని పాస్ట్ గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు

సత్యవతి నగర్ లోని శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద కైండ్ నెస్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ తిరుమల్ల సూరిబాబు అధ్యక్షతన ప్రత్యేక పూజలు జరిగాయి ఆలయకమిటీ చైర్మన్ డైమండ్స్ సెక్రటరీ లయన్ కాళ్ళ గోపి కృష్ణ కమిటీ సభ్యులు అమ్మవారి విశిష్టత తెలియచేస్తూ ఆలయ సంప్రదాయం తో సత్కరించి తీర్ద ప్రసాదాలు అందించారు .. ఈ సందర్బంగా గట్టిం మాణిక్యాలరావు సరోజినీ దంపతులకు అమ్మవారికి ఆషాడం సారి చీర పసుపు కుంకుమలు అందించిన ఆలయం అభివృద్ధి కి రు 25000/ నగదు విరాళం అందించారు.. ఈసందర్బంగా గట్టిం మాణిక్యాల రావు మాట్లాడుతూ అమ్మవారి విశిష్ట త పురప్రజలు నమ్మకం అని అందరికి అమ్మవారి దీవెనలు అందలని రైతులకు వర్షం చాలా అవసరశీ అని అ మ్మవారి అనుగ్రహం తో వర్షాలు సం వృద్దిగా పడాలని ప్రార్ధించారు రీజియన్ ఛైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ శ్రీ వారాహి అమ్మవారి గుప్త నవరాత్రులు స్కంద షష్ఠి ఐన ఈ రోజున లయన్ గట్టిం మాణిక్యాల రావు గారి కుటుంబం ఆలయ అభివృద్ధి కి సహకారం అమ్మవార్కి ఆషాడం సందర్బంగా వర్షం కోసం అమ్మవారికి ప్రత్యేక ప్రత్యేక పూజలు స్ఫూర్తి దాయకం అని పూజల్లో పాల్గొన్న గట్టిం నవీన్ సింధు.. గట్టిం ప్రవీణ్ కృష్ణ భవాని దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ. సభ్యులు యస్ వి. రంగారావు మురళీ. ఎరుబండి సతీష్. జనసేన నేత రమేష్. కైండ్ నెస్ సభ్యులు లయన్స్ అల్లుశ్రీనివాస్ బాలాజీ పాండురంగారావు


తదితరులు పాల్గొన్నారు

# శ్రీస్వామివారి నిత్యాన్నదానానికి రూ.1 లక్ష విరాళం

**పెన్ పవర్, ద్వారకాతిరుమల, జూలై 18:**ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఏలూరుకు చెందిన వి. అంజనాదేవి కుటుంబ సభ్యులు రూ.1 లక్ష విరాళాన్ని శనివారం ఆలయ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఏఈవో ఎం. దుర్గారావు విరాళాన్ని స్వీకరించి, దాతలకు విరాళం బాండ్‌ను అందజేశారు. శ్రీస్వామివారి నిత్యాన్నదాన పథకానికి అందించిన ఈ విరాళానికి ఆలయ అధికారులు దాత కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



## ప్రభుత్వ వైద్య కళాశాలలో స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 18 :**స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల లో ఆంధ్రప్రదేశ్ వైద్య విద్యా సంచాలకులు మార్గదర్శకాల మేరకు, శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ప్రిన్సిపాల్ డా. కె.వి. శివప్రసాద్ ప్రారంభోప న్యాసం చేస్తూ స్వచ్ఛత , సమాజ ఆరోగ్య పరిరక్షణలో పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు. ప్రతి పౌరుడు స్వచ్ఛ ఆంధ్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపు నిచ్చారు. వైద్య విద్యార్థులు పరిశుభ్రతపై నడుంబిగిం చాలని కోరారు. కమ్యూనిటీ విభాగములో పనిచేస్తున్న ఆరోగ్య విద్యా బోధకులు ఆర్ శ్రీనివాస్ పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని పాల్గొన్నవారిచే ప్రతిజ్ఞ చేయించారు .
అనాటమీ విభాగాధిపతి డా. టి. శారద పర్యావరణ పరిరక్షణలో మొక్కల పెంపకం ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమాన్ని అసిస్టెంట్ డైరెక్టర్ డా. సూర్యారావు సమన్వయం చేశారు.
ఈ కార్యక్రమంలో కళాశాలలోని వివిధ విభాగాల అధ్యాపకులు, అధ్యాపకేతర, పరిపాలన విభాగ సిబ్బంది, పారిశుధ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ ప్రజారోగ్య అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.


## 32వ డివిజన్లో అభివృద్ధి పనులకు ఆదిరెడ్డి శంకుస్థాపన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 18:**స్థానిక 32వ డివిజన్లో చాలా సంవత్సరాలుగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న బాలయోగి , మసీదు వీధులు, డ్రైనేజీ, రహదారి సమస్యలకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చేపట్టిందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. డివిజన్ లో రూ.33 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజి నిర్మాణాలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ ఇన్‌చార్జ్ ద్వారా పార్వతి సుందరి ప్రతిపాదన మేరకు రూ.33 లక్షలతో అభివృద్ధి పనులు మంజూర య్యాయని చెప్పారు. బాలయోగి వీధి లో 520 మీటర్ల డ్రెయిన్, 120 మీటర్ల సీసీ రోడ్డు, మసీదు వీధి లో 540 మీటర్ల డ్రెయిన్, 130 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఇరుకు వీధుల్లో డ్రెయిన్లపై మెట్లు, నిర్మాణాలు ఉండటంతో పారిశుధ్య కార్మికులు డ్రెయిన్లను శుభ్రం చేయలేకపోతున్నారని, నీరు నిల్వ ఉండి దోమల సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. డ్రెయిన్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, కొత్తగా నిర్మిస్తున్న డ్రెయిన్లు, రహదారులతో మరో 25 సంవత్సరాల పాటు పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## అత్యవసర ప్రాణరక్షణలో ఎక్మో సేవలలో యశోద హాస్పిటల్స్

✸ ఎక్మో సేవలలో దేశంలోనే ప్లాటినం సర్టిఫైడ్ కేంద్రం





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 18:**హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్స్ (హైటెక్ సిటీ) అత్యవసర వైద్య సేవల్లో నూతన ఒరవడి ప్రవేశపెట్టింది. ప్రపంచ స్థాయి అవయవ మార్పిడి, అధునాతన ఎయిర్ అంబులెన్స్ సేవలతో పాటు ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు అందించే ఎక్స్‌ట్రా కార్పోరియల్ లైఫ్ సపోర్ట్ (ఎక్మో) విభాగంలో ప్రత్యేకత సాధించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్యం అందిస్తున్నందుకు ఎక్స్‌ట్రాకార్పోరియల్ లైఫ్ సపోర్ట్ ఆర్గనైజేషన్ (ఎల్సా) నుంచి అత్యున్నత ప్లాటినం అవార్డును దక్కించుకుంది. ఈ గుర్తింపు పొందిన దేశంలో మొట్టమొదటి, ఆసుపత్రిగా యశోద హాస్పిటల్స్ చరిత్ర సృష్టించిందని సీనియర్ లీడ్ కన్సల్టెంట్ డాక్టర్ వి. రవిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రోగుల భద్రత, నాణ్యమైన వైద్యం, ఉత్తమ అంతర్జాతీయ నిబంధనలు పాటించడం వల్లే ఈ అరుదైన గుర్తింపు సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, ఎముక మజ్జ మార్పిడి వంటి సంక్లిష్ట చికిత్సలను అత్యంత నైపుణ్యం కలిగిన వైద్య బృందం నిరంతరం సేవలందిస్తోందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎక్మో సదుపాయం ఉన్న ప్రత్యేక ఎయిర్ అంబులెన్స్ దేశవిదేశాల నుంచి రోగులను వేగంగా, సురక్షితంగా తరలించే వ్యవస్థను ఆసుపత్రి విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. అంతర్జాతీయ సంస్థలలో శిక్షణ పొందిన వైద్యుల పర్యవేక్షణలో భారతీయ క్రిటికల్ కేర్ రంగాన్ని యశోద హాస్పిటల్స్ ప్రపంచ స్థాయికి తీసుకువె ళ్తోందన్నారు. ఈ మీడియా సమావేశంలో యశోద హైటెక్ సిటీ మార్కెటింగ్ టీం లీడర్ చంద్రశేఖర్, మార్కెటింగ్ ప్రతినిధులు ఎస్.వి.వి. రామకృష్ణ, వి. సాయికిరణ్ పాల్గొన్నారు

## ఎర్రకాలువ సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తా :ఎమ్మెల్యే బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. జూలై 18 :** దీర్ఘకాలంగా ఉన్న ఎర్ర కాలువ ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం మాధవరం వద్ద ఎర్రకాలువ పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెం మండలం మాధవరం, జగన్నాధపురం గ్రామాలలో ఎర్ర కాలువ ఆధునీకరణ, కాజ్ వే నిర్మాణం త్వరలో పూర్తిచేస్తామని తెలిపారు. ఎర్రకాలువ సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా అవసరమైన చర్యలు చేపడతామన్నారు. రెండు జిల్లాల సరిహద్దులో ఉన్న ఎర్రకాలువ వర్షాకాలంలో పొంగిపోవడంతో విద్యార్థులు, గ్రామస్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అత్యవసర పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తాత్కాలికంగా సుమారు రూ.20 లక్షల వ్యయంతో తాత్కాలిక మార్గం (కాజ్‌వే) నిర్మించినట్లు తెలిపారు. శాశ్వత పరిష్కారంగా బ్రిడ్జి నిర్మిస్తే నీటి ప్రవాహం సాఫీగా జరిగి ముంపు సమస్య తగ్గుతుందన్నారు. ఇందుకు అవసరమైన నిధుల కోసం జిల్లా కలెక్టర్‌ను కోరనున్నట్లు వెల్లడించారు. మాధవరం నుంచి నిడదవోలు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గమని, అందువల్ల ఈ మార్గాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మిగిలిన పనులను కూడా సంబంధిత శాఖతో త్వరితగతిన పూర్తి చేస్తామని అన్నారు.
ఎర్రకాలువ ఆధునీకరణకు రూ.2.80 కోట్ల నిధులను మంజూరు చేసిన నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరో రూ.6 కోట్ల నిధులు కేటాయిస్తే ఎర్రకాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మాధవరం, జగన్నాధపురం గ్రామాలకు ఎర్రకాలువ ముంపు నుంచి త్వరలోనే విముక్తి కలిగిస్తామని అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు అహర్నిశలు కృషిచేసి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యాల మేరకు ప్రతి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.




## ఎంపీని పరామర్శించిన గడ్డమణుగు రవికుమార్



**జీలుగుమిల్లి, పెన్ పవర్, జూలై 18;** ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్ట మహేష్ కుమార్ యాదవ్ నానమ్మ పుట్ట పోలమ్మ ఇటీవల స్వర్గస్తులైనారు. శనివారం హైదరాబాదులో ఎంపీ నివాసంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి, ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ ప్రత్యేక ఆహ్వానితులు, గడ్డమణుగు రవికుమార్ పరామర్శించారు.. పుట్ట పోలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈయనతోపాటు ఎంపీని పరామర్శించిన వారిలో చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జీలుగుమిల్లి టిడిపి సీనియర్ నాయకులు వనమా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు .

## ముద్రగడ పద్మనాభం మృతి పట్ల సంతాపం తెలియజేసిన
## వైస్సార్సీపీ ఇంచార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూలై 18:**ముద్రగడ పద్మనాభం గారి నివాసానికి చేరుకున్న వడ్డీ రఘురామ్ నాయుడు గారు వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం వారి కుమారుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీ ముద్రగడ గిరి ని మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు..
ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు గొర్రెల శ్రీనివాసరావు, రూరల్ మండలం అధ్యక్షులు చిట్టూరి బాపన్న, పెంటపాడు అధ్యక్షుడు కైగల శ్రీనివాసరావు, మాకురాజు సతీష్, ఇంజమూరి శ్రీనివాసరావు, ద్వారపూడి కిరణ్ రెడ్డి,గోపిశెట్టి దొరబాబు, సబ్బిటి బ్రహ్మయ్య, రెడ్డి సూరిబాబు, కలిశెట్టి తాతారావు, బుడి ప్రసాద్, తానేటి అజయ్, మార్లపూడి సుబ్బారావు, చామన సూర్యచంద్రరావు, కండెల్లి రాజేష్, బండి నరసింహారావు, ములపర్తి అఖిల్, వైఎస్ఆర్సిపి నాయకులుపాల్గొని నివాళులర్పించినారు

## ప్రతిభ పురస్కారానికి ఎంపిక

**జీలుగుమిల్లి, పెన్ పవర్, జూలై 18 ;** షైనింగ్ స్టార్ అవార్డుకు జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో హెచ్ఈసి గ్రూపులో 931 మార్కులు సాధించిన గడ్డం పూజ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి సతీష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న ఏలూరులో జరిగే కార్యక్రమంలో గెడ్డం పూజకి ప్రశంస పత్రం, పథకం, 20 వేల రూపాయలు నగదు అందజేయనున్నట్లు తెలిపారు .అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది విద్యార్థినికి అభినందనలు తెలిపారు.



## 120 మంది పేదలకు ఉచిత నిత్యావసర సరుకులు





**గంగవరం, పెన్ పవర్ జూలై 18:** పేద కుటుంబాలకు అండగా నిలిచే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఉచిత నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో 120 మంది లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రెక్సలర్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో గిరికిరణం అగ్రో ఫారెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరికిరణం సంస్థ చైర్మన్ టీ.వెంకటరమణ మాట్లాడుతూ సభ్యత్వం పొందిన ప్రతి వ్యక్తికి ప్రతి నెల రూ.500 విలువైన నాణ్యమైన నిత్యావసర సరుకులను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. పేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎంపీడీఓ లక్ష్మణరావు మాట్లాడుతూ పేద ప్రజలకు ఉపయోగపడే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఇలాంటి సహాయ కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో గిరికిరణం సంస్థ డైరెక్టర్ ఏ.రత్నం (బేబీ), వైస్ ఎంపీపీ కె.గంగాదేవి, మాజీ సర్పంచ్ కలుముల అక్కమ్మ, సమన్వయకర్తలు నాగశేషమ్మ, వరలక్ష్మి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర  భాగంగా బిఆర్ మార్కెట్‌లో బల్క్ వేస్ట్ జనరేటర్ల గుర్తింపు.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూలై 18:**ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే  స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల తాడేపల్లిగూడెం బీఆర్ మార్కెట్‌లో మున్సిపల్ కమిషనర్ శ్రీ ఎం యేసుబాబు ఆధ్వర్యం లో  ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా  బల్క్ వేస్ట్ జనరేటర్ల గుర్తింపు చేపట్టారు. హోటళ్లు, రెస్టారెంట్లు, కల్యాణ మండపాలు, వాణిజ్య సముదాయాలను పరిశీలించి, ఎక్కువ వ్యర్థాలు ఉత్పత్తి చేసే సంస్థల వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ ఎం యేసుబాబు మాట్లాడుతూ వ్యర్థాలను వాటి ఉత్పత్తి స్థానంలోనే వేరుచేసి, కంపోస్ట్ లేదా రీసైక్లింగ్ చేసేలా బల్క్ వేస్ట్ జనరేటర్లకు అవగాహన కల్పించామని. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర లక్ష్యాలను సాధించేందుకు అందరూ సహకరించాలని కోరారు. అదే సమయంలో క్యాచ్ ది రైన్ క్యాంపెయిన్ కింద వర్షపు నీటిని ఒడిసిపట్టి సంరక్షించాలనే లక్ష్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు ప్రమాణం చేశారు. వర్షపు నీటిని వృథా చేయకుండా ప్రతి ఇంటిలో, ప్రతి సంస్థలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

"పరిశుభ్రతతో పాటు నీటి సంరక్షణ కూడా మన బాధ్యత. రెండింటిపై ప్రజల్లో అవగాహన పెంచాలి" అని కార్యక్రమంలో పాల్గొన్నవారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కమిషనర్ తో పాటు అసిస్టెంట్ కమిషనర్ భవానీ బాబు , మున్సిపల్ ఇంజనీర్ వెంకట రమణ ,మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది ,



సచివాలయ సిబ్బంది,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# చదువుల తల్లి కొవ్విలా సాహితి  ఎమ్ బి ఎ పూర్తి పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు.





**గోకవరం పెన్ పవర్ జులై 18:--** తండ్రి రిటైర్ ప్రధానోపాధ్యాయుడు తల్లి గృహిణి భర్త సాఫ్ట్వేర్ ఇంజనీర్ అలా అని తనేమీ తక్కువ కాదు కలకత్తాలో ఎలక్ట్రికల్ ఇంజనీర్ గా పనిచేసింది. బీటెక్ పూర్తి చేసి కలకత్తాలో ఎలక్ట్రికల్ ఇంజనీర్ గా పనిచేస్తూ వివాహం జరగడంతో తన ఉద్యోగానికి కొంత విరామం ఇచ్చింది చదువులతల్లి కొవ్విలా సాహితీ అనంతరం అంగర లక్ష్మీనారాయణ అనే సాఫ్ట్వేర్ ఇంజనీర్ ని వివాహమాడి కుటుంబ బాధ్యతలు మాత్రమే కాకుండా ఉన్నత చదువులు చదవాలనే సంకల్పంతో తల్లిదండ్రులు భర్త ప్రోత్సాహంతో ఐఐటి లో మంచి ర్యాంకు సాధించి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ నుండి ఎంబీఏ పట్టా అందుకుంది.

చదువుల తల్లి కొవ్విలా సాహితి తన స్వగ్రామం మాగం కాగా తండ్రి ఉద్యోగరీత్యా తూర్పుగోదావరి జిల్లా లోనే తన ప్రస్థానం కొనసాగింది తన తండ్రి ఉద్యోగరీత్యా కోటికేశవరం లో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ రిటైర్ అయ్యి కొంతమూరులో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. సాహితి తిరుమల విద్యాసంస్థల్లో తన విద్యాభ్యాసం అంత పూర్తి చేసి బీటెక్ ఎలక్ట్రికల్ లో పట్టా పొంది కలకత్తాలోని తన ఉద్యోగ ప్రస్తావన్ని ప్రారంభించింది. అనంతరం వివాహం జరగడంతో కొంతకాలం విరామం ఇచ్చి ఎంబీఏ చేయాలని కోరిక నెరవేర్చుకుంది దీనికి సంబంధించి శుక్రవారం మద్రాస్ లో ఎంబీఏ పట్టా తీసుకున్న సందర్భంలో వాళ్ల కుటుంబ సభ్యులు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తన బిడ్డ ఎంబీఏ పూర్తి చేసిన సందర్భంగా తండ్రి కోవిలా సత్యనారాయణ తల్లి వరలక్ష్మి, తన భర్త అంగర లక్ష్మీనారాయణ, మేనమామ రేలంగి అప్పారావు లు తమ కుటుంబ సభ్యుల తల్లి సాహితీని అభినందిస్తూ తమ బంధువులకు స్థానికులకు స్వీట్లు పంచారు. ఇదిలా ఉండగా సాహితికి మరో అరుదైన అవకాశం దక్కింది హైదరాబాదులోనే తన భర్తకు తగ్గట్టుగా మంచి ఉద్యోగం కూడా లభించిందని తన మేనమామ గోకవరం మండలం గోపాలపురం కి చెందిన రేలంగి అప్పారావు చెప్పారు.

## అమ్మవారి గుడి నిర్మాణానికి 5000/- వేలు విరాళం అందజేత



**గోకవరం పెన్ పవర్ జులై 18:--** మండలంలోని వెదురుపాక గుమ్మలదొడ్డి బావాజీపేట గ్రామాల మధ్యలో ఉన్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి కాలనీలో అక్కడ ప్రజలు ఏర్పాటు చేసుకున్న దుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణానికి శ్రీ లలిత మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పిఎంపి జిల్లా ఉపాధ్యక్షులు పెంటిమాని అప్పారావు ( చిన్ని ) తన ట్రస్టు ద్వారా సహాయ సహకారాలు అందిస్తానని తన వంతుగా కొంత చిరు సహాయం చేస్తున్నానంటూ స్థానికులకు ఐదువేల రూపాయలు విరాళం అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు పి.ఎం.పి జిల్లా అధ్యక్షులు బల్ల శ్రీనివాస్, కార్యదర్శి దేవానందం చేతుల మీదుగా కమిటీ కి అందజేశారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ స్వయంభువుగా వెలిసిన అమ్మవారి గుడి కి భక్తులు తమకు తోచిన విధంగా విరాళాలు కమిటీ వారికి అందించి సహకరించాలని కోరారు.

# తిరువూరు ఆర్డీవో,నుకలసిన,నిర్వాసితులు






**-టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు,బొర్రా నరేష్,కుమార్, టిడిపిపార్టీ,సీనియర్,నాయకులు, బి.నరసింహారావు**

**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.18**:పోలవరం ప్రాజెక్టు,కారణంగా సర్వంకోల్పోతున్న, వి.ఆర్.పురం నిర్వాసితులు,మరియు టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు ,బొర్రానరేష్,కుమార్,టిడిపిపార్టీ, సీనియర్, నాయకులుబొర్రానరసింహారావు,శనివారం తిరువూరు ఆర్డీవో,ఏ. కుమార్, కలిసివి.ఆర్.పురం గ్రామనిర్వాసి తులకు,తిరువూరు,ఆర్.అండ్.ఆర్. పునరావాస,కాలనీ,స్థలాలుమాఅందరికీ ఆమోదం గాఉన్నాయని,గంపలగూడెం మండలంలోని,పెను గొలనుగ్రామంలో, ఇటీవలచూపించిన,భూములు, నివాసయోగ్యం గారైతులకు అన్నివిధాలుగా ఉప యోగపడేలా ఉన్నాయని,ఆ భూములను,మాగ్రా మంనిర్వాసి తులకు, కేటాయించాలని,కోరారు. మండలం లోని కొంతమ ంది,స్వార్థప రులు,స్వార్థం కోసంతప్పుడు ప్రచారాలు చేస్తున్నార ని,వి.ఆర్.పురం గ్రామ,నిర్వాసితులు ఆరోపించారు.ఇలాంటి,తప్పుడు ప్రచారా లు,మానుకోవాలని,గ్రామనిర్వాసితులు,హెచ్చరిం చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్, బొర్రానరసింహా రావు,సూరి,శ్రీధర్,అప్పాజీ,తదిత రులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన మాంటిస్సోరి విద్యార్థిని



**తాళ్లపూడి, పెన్ పవర్, జులై 18:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ వరుసగా రెండో ఏడాది తాళ్లపూడి మాంటిస్సోరి హైస్కూల్ విద్యార్థులు సాధించారు. 2026 పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 578 మార్కులు సాధించిన కత్తిరి సంజన షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ వి.వి.అనీష్ తెలిపారు. ఈనెల 20న ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డుతో సత్కరిస్తున్నట్లు కరస్పాండెంట్ అనీష్ తెలిపారు. ఈ అవార్డుకు ఎంపికైన సంజనకు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, స్కూల్ యాజమాన్యం ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## డీఎమ్ హెచ్ఓ డాక్టర్  కోమలిని కలిసిన పీఎంపీలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 18** తూర్పుగోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా నియమితులైన డాక్టర్ పితాని కోమలిని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ( ది పిఎంపి అసోసియేషన్) సభ్యులు శనివారం బొమ్మూరు కలెక్టర్ ఆఫీసు నందు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ కోమలి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పీఎంపీలు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలలో విరివిగా పాల్గొనాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల, కోవిడ్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రథమచికిత్స మాత్రమే అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియే షన్ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి దేవానందం, నగర శాఖ అధ్యక్షులు రహమాన్ ఖాన్,కార్యదర్శి మట్టా రమేష్,కోశాధికారి కోల లక్ష్మీనారాయణ, కేఎస్ఎస్ఎన్ రెడ్డి, సీహెచ్ఎన్ఎస్బీ కామరాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం కార్యకర్తకు కుడుపూడి  చేయూత



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 18:** నగరంలోని స్థానిక 3వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యకర్త బొమ్మనమైన అంతర్వేది (60) బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై చికిత్స పొందుతూ ఇంటివద్దనే కోలుకుంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు స్పందించి ఆరోగ్య పరిస్థితి మరింత మెరుగుపడాలని రూ.5,000 విలువైన రెండు నెలలకు సరిపడే మందులను, కుటుంబ అవసరాల కోసం రూ.2,000 నగదును అంతర్వేది భార్య బొమ్మనమైన పెద్దింట్లుకు అందచేశారు. సీఎం చంద్రబాబు స్ఫూర్తితో పార్టీ కార్యకర్తలకు అండగా నిలవడం తమ బాధ్యత అని కూడిపూడి సత్తి బాబు అన్నారు. ఈ సహాయానికి బాధిత కుటుంబ సభ్యులు  సత్తిబాబు కి కృతజ్ఞతలు తెలిపారు.ద

## ఈనెల 21న మోరంపూడి ఫ్లైఓవర్ వద్ద వైసిపి ఆందోళన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 18:**మోరంపూడి జంక్షన్లో ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్లు నిర్మాణంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి ఆందోళన చేపడుతున్నట్టు మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్చార్జ్ మార్గాన్ని భరత్ రామ్ వెల్లడించారు. శనివారం బొమ్మూరు పోలీస్ స్టేషన్ లో పార్టీ నాయకులు స్టేషన్ అధికారికి నిరసన వివరాలు అందచేశారు.ఈనెల 21వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మోరంపూడి ఫ్లైఓవర్ వద్ద ధర్నా నిర్వహించడంతో పాటు  రిలే నిరాహార దీక్షలు కూడా నిర్వహించడానికి సిద్ధమవు తున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు  ఓవర్ ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మాణం చేసే వరకు వైసిపి ఆందోళన ఆగేది లేదని హెచ్చరించారు. సీనియర్ పార్టీ నాయకులు , దాసి వెంకటరావు , మార్గాని రాము, చిటికిన కార్తీక్ తదితరులు అంద చేసిన వారిలో ఉన్నారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో కేంద్ర ప్రభుత్వం, సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో  మోరంపూడి జంక్షన్లో తాను ఎంపీ గా ఉండగా ఫ్లైఓవర్ (పై వంతెన) నిర్మాణం చేయడం జరిగిందన్నారు. ప్రత్యేక శ్రద్ధ తో ఈ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేశామన్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్లు పాలన లో ఫ్లైఓవర్ కి రెండు వైపులా  సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపట్టడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడటంతో పాటు వాహన ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు పార్టీ తరపున వత్తిడి తెచ్చేందుకు ఆందోళనలు నిర్వహించ నున్నట్లు తెలిపారు.

వైసీపీ శ్రేణులతో పాటు స్థానిక ప్రజలు కూడా తమ ఆందోళనలో భాగస్వాములు కావాలని మార్గాన్ని భరత్ రామ్ కోరారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at  SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504,  Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at  Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003  Editor: GANTYADA APPARAO.  Mobile : 9059465965,  RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణపై అంగన్వాడీ సిబ్బందికి అవగాహన సమావేశం





**చింతూరు, పెన్ పవర్, జూలై 18:** అంగన్వాడీ వర్కర్లు, మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళల భద్రత, శక్తి యాప్ వినియోగం, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, బాల్య వివాహాల అరికట్టడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో చింతూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ కృష్ణ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కన్నప్ప రాజు, చింతూరు ఎస్ఐ సంతోష్ కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లతాశ్రీ, చింతూరు సీడీపీఓ జయలక్ష్మి పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూ మహిళలపై జరిగే వేధింపులు, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్తో పాటు పోలీసుల అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని వివరించారు. అలాగే గ్రామాల్లో బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో అంగన్వాడీ సిబ్బంది, మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మహిళల భద్రతకు సంబంధించిన పలు సూచనలు, జాగ్రత్తలు మరియు అత్యవసర హెల్ప్‌లైన్ సేవలపై అధికారులు అవగాహన కల్పించారు.

## ప్రజల భద్రతే .. ముఖ్యం..

గ్రామాల్లో గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన..



**సీతానగరం, పెన్ పవర్ జూలై 18:** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు సీతానగరం మండల వ్యాప్తంగా ఎస్సై ఎల్. శ్రీను నాయక్ సిబ్బందితో రాత్రివేళ సమస్యాత్మకమైన ప్రాంతాలలో గ్రామసభలు నిర్వహిస్తూ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజల భద్రతే ముఖ్యం అంటూ పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వంగలపూడి గ్రామాల్లో పోలీస్ అధికారులు ,సిబ్బంది పర్యటించి ఆయన మాట్లాడుతూ బాలికలపై జరిగే నేరాలు, బాల్య వివాహాలు సైబర్ మోసాలు, పోక్సో కేసులు ,నూతన చట్టాలు పై గ్రామసభల ద్వారా అవగాహన కల్పించారు. ఆన్లైన్ మోసాలు, ఓటీపీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, మోసం జరిగితే ఆలస్యం చేయకుండా వెంటనే డైల్ 1930 కు కాల్ చేయాలని సూచించారు. సాయంత్రం వేళ వాహనాలు తనిఖీలు చేపట్టడంతో పాటు ,రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు.

ఆపద సమయంలో తక్షణ సహాయం కోసం డైల్ 100, 112 నంబర్లను ఉపయోగించుకోవాలి. ప్రతి మహిళ శక్తి యాప్ ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామంలో ఎటువంటి గొడవలకు వెళ్లకుండా అందరూ కలిసి మెలిసి ఉండాలని సూచించారు. ఏ సమస్యలు ఉన్న పోలీసులు దృష్టికి తీసుకురావాలని ఎస్సై ఎల్. శ్రీను నాయక్ తెలిపారు.

## మాజీ మంత్రి, ముద్రగడ కుటుంబానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శ.

- ముద్రగడ చిత్రపటానికి ఘన నివాళులు.




**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై 18:** మాజీ మంత్రి,కాపు ఉద్యమ నేత,స్వర్గీయ ముద్రగడ పద్మనాభం మృతికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సంతాపం వ్యక్తం చేశారు.కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి టిడిపి నాయకులతో చేరుకున్న ఆమె,ముద్రగడ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ముద్రగడ కుటుంబ సభ్యులను పరామర్శించిఎమ్మెల్యే సత్యప్రభ ఆయన కుమారులు ముద్రగడ బాలు,గిరిబాబులకు ధైర్యం చెప్పారు.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన ముద్రగడ పద్మనాభం సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.రాజకీయ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ముద్రగడ పద్మనాభం ప్రజల మనసుల్లో నిలిచిపోతారని అన్నారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ,రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మూది నారాయణ స్వామి,నియోజకవర్గ సిబిఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్,ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి,ఏలేశ్వరం పట్టణ నాయకులు బొదిరెడ్డి గోపి,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్,ప్రత్తిపాడు సిహెచ్సి వర్కింగ్ కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్లు వెలుగుల నాని,బొల్లు వెంకటేశ్వరరావు,తదితరులు ముద్రగడకు ఘన నివాళులర్పించారు.

## కొత్తపల్లిలో పునరావాస,కాలనీలకు స్థలాలు అనుకూలం



**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.18:** గోకవరంమండలం కొత్తపల్లిలో పునరావాస, కాలనీలకుస్థలాలు అనుకూలంగాఉన్నాయని, వి.ఆర్.పురం నిర్వాసితులకుఇటీవల సంబం ధిత,అధికారులు,కృష్ణాజిల్లాతిరువూరుపరిసర ప్రాంతాలకు నిర్వాసితులను తీసుకెళ్లి, అక్కడ భూములనుచూపించడం జరిగింది.అక్కడభూ భాగంనివాసగృహాలకు అనుకూలంగాలేవని,నీటి సౌకర్యం,ఉపాధిఅవకాశాలులేనందున,మాకుఆప్రాం తంలోపునరావాసంవద్దని,వి.ఆర్.పురం కొంతమంది నిర్వాసితులుతెలిపారు.కృష్ణాజిల్లాలో మాకుస్థలాలు వద్దు,తూర్పుగోదావరిజిల్లా గోకవరం పరిసర ప్రాంతాల్లో ఉన్నకొత్తపల్లి గ్రామరైతులు భూములుఇవ్వటానికి,అను కూలంగాఉన్నందున,మాకుఆ ప్రాంతాన్నిచూపించి,మాకు పునరావాసం,కల్పించాలని,సంబంధిత,అధికారులను నిర్వాసితులు,కోరుతున్నారు.




## స్వర్గీయ మాజీ మంత్రి ముద్రగడ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలి.

-ముద్రగడ సమాధి వద్ద క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ప్రత్యేక ప్రార్థనలు.





**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 18:** స్వర్గీయ మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత, ప్రజా శ్రేయోభిలాషి ముద్రగడ పద్మనాభం పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని జగ్గంపేట నియోజకవర్గానికి చెందిన పలువురు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ముద్రగడ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ముందుగా ఆయన చిత్ర పటానికి, సమాధి వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్రగడ మృతి వారి కుటుంబానికే కాకుండా, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు తీరని లోటని పలువురు సంఘ ప్రతినిధులు అన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ముద్రగడ కుమారులు ముద్రగడ వీరారాఘవరావు (బాలు), ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబులను పరామర్శించి తమ తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కె జాన్ వెస్లీ, రెవరెండ్, ఎం నాగభూషణం,జుత్తుక నాగేశ్వరావు,డి ప్రసాదరావు, కె సంతోష్ కుమార్, ఎస్ నేరేంద్ర, పి రాజు,ఎస్ రఘుయేల్, ఎస్ వెంకటరత్నం, కె యేసురాజు, ఎస్ సమర్పణ అధిక సంఖ్యలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి,ముద్రగడ ఇచ్చిన మాటకు కట్టుబడే గొప్ప వ్యక్తి.

-ఎమ్మెల్యే వనమాడి, ఎమ్మెల్సీ, పేరా బత్తుల, మాజీ ఎమ్మెల్యే, ఎస్.వి.ఎస్.ఎన్ వర్మ.





**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 18 :** స్వర్గీయ మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం ఇచ్చిన మాటకు కొట్టుబడే గొప్ప వ్యక్తి ముద్రగడ పద్మనాభం అని అటువంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం దురదృష్టకరమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే,వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. శనివారం ముద్రగడ కుమారులు ముద్రగడ వీర రాఘవరావు (బాలు) ప్రత్తిపాడు నియోజకవర్గం ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు లను పరామర్శించి తమ తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. అనంతరం ముద్రగడ చిత్రపటానికి, సమాధి వద్ద పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్రగడ ఎమ్మెల్యేగా,మంత్రిగా, పార్లమెంట్ సభ్యునిగా అనేక పదవులు చేపట్టి అనేక అభివృద్ధి,సంక్షేమ పథకాలు చేపట్టిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఒక కాపు ఉద్యమమే కాకుండా, అనేక ప్రజా ఉద్యమాలు చేపట్టి ఉద్యమ నేతగా గుర్తింపు పొందారన్నారు. అటువంటి వ్యక్తి మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

# భారత్ అంతరిక్ష రంగంలో మరో చారిత్రాత్మక విజయం

- 'విక్రమ్-1' విజయంతో దేశ ప్రతిష్ఠ మరింత పెరిగింది
- మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం/అమరావతి, జూలై 18 పెన్ పవర్:** భారతదేశం అంతరిక్ష రంగంలో మరో కీలక విజయాన్ని నమోదు చేసుకోవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.స్వదేశీ సాంకేతికతతో ప్రైవేట్ అంతరిక్ష రంగం అభివృద్ధి చేసిన 'విక్రమ్-1' రాకెట్ తొలి ప్రయోగం విజయవంతం కావడం భారత శాస్త్ర సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనమని ఆయన అన్నారు.

శనివారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ,భారత యువ శాస్త్రవేత్తల ప్రతిభ,పట్టుదల, ఆవిష్కరణాత్మక ఆలోచనలకు ఈ విజయం ప్రతీకగా నిలిచిందన్నారు. ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేట్ సంస్థలు కూడా అంతరిక్ష రంగంలో విశేషంగా రాణించగలవని ఈ ప్రయోగం మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ అంతరిక్ష రంగానికి కొత్త దిశ లభించిందని, ఇస్రో , ఇన్-స్పేస్ , ఎన్ఎస్ఐఎల్ వంటి సంస్థల సహకారంతో ప్రైవేట్ రంగానికి విస్తృత అవకాశాలు కల్పించడం వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవుతున్నాయని మంత్రి వివరించారు.'విక్రమ్-1' ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసిన స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, ప్రాజెక్టులో భాగమైన ప్రతి ఒక్కరికీ మంత్రి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.భారతదేశం అంతరిక్ష రంగంలో ప్రపంచ అగ్రదేశాలతో పోటీపడుతున్న ఈ సమయంలో యువత శాస్త్ర, సాంకేతిక రంగాలపై మరింత ఆసక్తి పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. విజ్ఞానం, సాంకేతికతే దేశాభివృద్ధికి ప్రధాన చోదకశక్తులని పేర్కొంటూ, భవిష్యత్తులో భారతదేశం అంతరిక్ష పరిశోధనల్లో మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.'విక్రమ్-1' విజయంతో భారత జెండా అంతరిక్ష రంగంలో మరింత ఎత్తుకు ఎగిరిందని, ఇది కేవలం రాకెట్ ప్రయోగం విజయం మాత్రమే కాకుండా 'ఆత్మనిర్భర్ భారత్' సంకల్పానికి ప్రతీక అని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.




# ‘బాధపడడం ఎందుకు?’.. రోహిత్ రిటైర్మెంట్ ప్రచారంపై కపిల్ దేవ్

### రోహిత్ రిటైర్మెంట్‌పై జోరు ప్రచారం
### దీనిపై స్పందించిన కపిల్ దేవ్
### ఏదో ఒకరోజు వీడ్కోలు చెప్పక తప్పదని వ్యాఖ్య
### ఇన్నేళ్లు రోహిత్ ఎంతో ఆనందం పంచాడని వెల్లడి
### అతడి రిటైర్మెంట్‌ను సెలబ్రేట్ చేసుకోవాలని సూచన
### బాధపడాల్సిన అవసరం లేదని హితవు



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రచారంపై మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ స్పందించాడు. రోహిత్ క్రికెట్‌కు వీడ్కోలు పలికే రోజు ఎప్పుడొచ్చినా అది బాధపడాల్సిన సందర్భం కాదని, సంబరాలు చేసుకోవాల్సిన క్షణమని అభిప్రాయపడ్డాడు. లార్డ్స్‌లో జరిగే మూడో వన్డే రోహిత్ చివరి అంతర్జాతీయ మ్యాచ్ కావొచ్చన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన స్పందించాడు. “బాధ ఎందుకు? ఇన్నేళ్లుగా రోహిత్ మనందరికీ ఎంతో ఆనందం పంచాడు. ఏదో ఒకరోజు అందరూ క్రికెట్‌ను వీడాల్సిందే. సునీల్ గవాస్కర్, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, సచిన్ టెండూల్కర్ ఇలా అందరూ వీడారు. అలాగే రోహిత్ కూడా ఒకరోజు తప్పకుండా వీడ్కోలు చెబుతాడు” అని కపిల్ దేవ్ అన్నాడు. రోహిత్ వెళ్లే రోజు అతడి కెరీర్‌ను గర్వంగా గుర్తుచేసుకోవాలని కపిల్ సూచించాడు. “దేశానికే కాదు, ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులకు అతడు ఎన్నో అద్భుతమైన క్షణాలు అందించాడు. అలాంటి ఆటగాడి ప్రయాణాన్ని బాధగా కాకుండా సెలబ్రేట్ చేసుకోవాలి” అని పేర్కొన్నాడు. అంతేకాదు, రోహిత్ రిటైర్ అయితే సెంచరీతో చిరస్మరణీయంగా వీడ్కోలు పలకాలని ఆకాంక్షించాడు. “ఏదో ఒకరోజు వెళ్లాల్సిందే. కానీ వెళ్లే ముందు శతకం బాది వెళ్లాలని కోరుకుంటున్నా” అని చెప్పాడు. 2007లో ఐర్లాండ్‌పై వన్డే అరంగేట్రం చేసిన రోహిత్ ఇప్పటికే టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో వరుసగా 11, 26 పరుగులకే పరిమితమవడంతో రిటైర్మెంట్ ఊహాగానాలు జోరందుకున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు ఎనిమిది వన్డేల్లో 241 పరుగులు చేసిన రోహిత్ సగటు 30.12గా ఉంది. ప్రస్తుతం లార్డ్స్ వేదికగా జరగనున్న నిర్ణయాత్మక మూడో వన్డేపై అందరి దృష్టి నెలకొంది.

# మెస్సీకి గోల్డెన్ ఛాన్స్.. ఫైనల్‌లో బద్దలు కొట్టే 5 రికార్డులివే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదివారం న్యూజెర్సీ స్టేడియంలో స్పెయిన్‌తో జరగబోయే ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్ మ్యాచ్ లో అర్జెంటీనా లెజెండ్ లియోనెల్ మెస్సీ కెరీర్‌లో ఆఖరి ప్రపంచకప్ అయ్యే ఛాన్స్ ఉంది. ప్రస్తుతం 39 ఏళ్ల వయసున్న మెస్సీ.. 43 ఏళ్ల వయసులో 2030లో మరో వరల్డ్ కప్ ఆడటం చాలా కష్టమే కాబట్టి, ఈ మ్యాచ్‌తోనే అతడు తన అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్ బై చెప్పాలని భావిస్తున్నాడు. ఈ టోర్నీలో ఇప్పటికే 8 గోల్స్, 4 అసిస్ట్‌లతో అద్భుత ఫామ్‌లో ఉన్న గోట్ మెస్సీ, ఈ ఫైనల్ మ్యాచ్ లో ఫుట్‌బాల్ చరిత్రలోని పలు ఆల్‌టైమ్ రికార్డులను బద్దలు కొట్టేందుకు సిద్ధమయ్యాడు. ఆ రికార్డుల గురించి ఇప్పుడు ఎ6 వెలుగు వెబ్ సైట్ లో తెలుసుకుందాం..

ఆదివారం మైదానంలోకి అడుగు పెట్టగానే ప్రపంచకప్ ఫైనల్ ఆడిన అత్యంత వృద్ధ అవుట్‌ఫీల్డ్ (గోల్‌కీపర్ కాకుండా) ఆటగాడిగా మెస్సీ రికార్డు సృష్టిస్తాడు.

సరికొత్త సవరణ: ఇక్కడ ఒక చిన్న ఆసక్తికరమైన విషయం గమనించాలి. ఒరిజినల్ నోట్స్‌లో మెస్సీ వయసును పొరపాటున “29 ఏళ్లు” అని పేర్కొన్నారు, కానీ ప్రస్తుతం 2026 జూలై నాటికి మెస్సీ అసలు వయసు 39 ఏళ్ల 25 రోజులు.

1982 ఫైనల్లో ఇటలీ గోల్‌కీపర్ డినో జోఫ్ 40 ఏళ్ల వయసులో ఆడి ఓవరాల్‌గా రికార్డు సృష్టించగా, అవుట్‌ఫీల్డర్లలో మెస్సీదే అగ్రస్థానం కానుంది. అంతేకాదు, ఈ మ్యాచ్‌లో మెస్సీ గనుక ఒక గోల్ చేస్తే.. ఫైనల్లో గోల్ చేసిన అత్యంత వృద్ధ ఆటగాడిగా నిలుస్తాడు. తద్వారా 1958లో 35 ఏళ్ల వయసులో గోల్ చేసిన స్వీడన్ ప్లేయర్ నిల్స్ లీడ్‌హోమ్ రికార్డును అధిగమిస్తాడు.

**మూడు ప్రపంచకప్ ఫైనల్స్ ఆడిన సెకండ్ ప్లేయర్:**
మెస్సీ కెరీర్‌లో ఇది మూడో ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ కానుంది. గతంలో ఆయన 2014 (జర్మనీతో ఓటమి), 2022 (ఫ్రాన్స్‌పై విజయం) ఫైనల్స్ ఆడాడు. ఫుట్‌బాల్ చరిత్రలో 3 ప్రపంచకప్ ఫైనల్స్ ఆడిన రెండో ఆటగాడిగా బ్రెజిల్ దిగ్గజం కాఫు (ఝుటబ - 1994, 1998, 2002) సరసన లియోనల్ మెస్సీ నిలుస్తాడు.

**కెప్టెన్‌గా రెండు వరల్డ్ కప్‌లు గెలిచిన తొలి ఆటగాడు:**
ఫుట్‌బాల్ చరిత్రలో ముందెన్నడూ ఏ కెప్టెన్ కూడా తన జట్టుకు రెండుసార్లు ప్రపంచకప్ టైటిల్ ని ఇప్పటి వరకు అందించలేదు. ఆదివారం అర్జెంటీనా గెలిస్తే, రెండుసార్లు కెప్టెన్‌గా ట్రోఫీని ముద్దాడిన ప్రపంచంలోనే ఏకైక ప్లేయర్ గా మెస్సీ చరిత్ర సృష్టించనున్నాడు.

**ఒకే ఎడిషన్‌లో అటాకింగ్ కాంట్రిబ్యూషన్స్:**
ప్రస్తుత 2026 ప్రపంచకప్‌లో మెస్సీ 8 గోల్స్, 4 అసిస్ట్‌లతో మొత్తం 12 గోల్ కాంట్రిబ్యూషన్స్ (భాగస్వామ్యాలు) అందించాడు. 1970లో పశ్చిమ జర్మనీకి చెందిన గెర్డ్ ముల్లర్ సాధించిన 13 గోల్స్-అసిస్ట్‌ల రికార్డును అధిగమించడానికి మెస్సీకి మరో రెండు పాయింట్లు (గోల్ లేదా అసిస్ట్) మాత్రమే అవసరం. ఒక గోల్ సాధిస్తే ముల్లర్ రికార్డును ఈక్వల్ చేస్తాడు. రెండు సాధిస్తే వరల్డ్ రికార్డ్ బ్రేక్ అవుతుంది.

**అరుదైన రికార్డులు:**
రెండు వేర్వేరు ఫైనల్స్‌లో గోల్స్: స్పెయిన్‌పై లియోనల్ మెస్సీ గోల్ చేస్తే.. రెండు వేర్వేరు ప్రపంచకప్ ఫైనల్స్‌లో గోల్స్ చేసిన 6వ ఆటగాడిగా నిలవనున్నాడు, పెలే, పాల్ బ్రెయిట్నర్, జినెదిన్ జిదాన్, కిలియన్ ఎంబాప్పేల సరసన చేరనున్నాడు.

వరల్డ్ కప్ ఫైనల్స్ మోస్ట్ గోల్స్: 2022 ఫైనల్లో మెస్సీ రెండు గోల్స్ చేశాడు. ఈ మ్యాచ్‌లోనూ రెండు గోల్స్ (దీతుఎవ) చేస్తే, ప్రపంచకప్ ఫైనల్స్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన ఎంబాప్పే రికార్డును సమం చేస్తాడు.

ఫ్రీ-కిక్ రికార్డు: ఒకవేళ మెస్సీ ఫ్రీ-కిక్ ద్వారా గోల్ సాధిస్తే, ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక ఫ్రీ-కిక్ గోల్స్ చేసిన ప్లేయర్స్ జాబితాలో అగ్రస్థానానికి చేరుకోనున్నాడు. ప్రస్తుతం అతని ఖాతాలో 2 ఫ్రీ-కిక్ గోల్స్ మాత్రమే ఉన్నాయి.

# అర్జెంటీనా జం స్పెయిన్ మధ్య ఫైనల్ ఫైట్.. ఎవరు గెలిస్తే భారత్‌కు లాభమో తెలుసా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రంవచవ్యాప్తంగా కోట్ల మంది ఫుట్‌బాల్ ఫ్యాన్స్ (ఆదివారం, జూలై 19న) జరగబోయే ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక మెగా సమరంలో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా వర్సెస్ స్పెయిన్ జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ప్రాణాలు పెట్టి ఆడి, హేమాహేమీ జట్లను మట్టికరిపించి ఈ రెండు టీమ్స్ తుది పోరుకు సిద్ధమయ్యాయి. మన దేశంలో ఫుట్‌బాల్‌కు అంతగా ఆదరణ లేకపోయినా, ఈ ఫైనల్ మ్యాచ్‌పై భారత క్రికెట్ ఫ్యాన్స్ కూడా ప్రత్యేకమైన ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. దీని వెనుక ఒక ఆసక్తికరమైన క్రికెట్ సెంటిమెంట్ దాగి ఉండటమే దీనికి ప్రధాన కారణం.

**2010లో స్పెయిన్ గెలుపు.. 2011లో భారత్ మ్యాజిక్:**
భారత క్రికెట్ ప్రేమికులు ఎప్పటికీ మర్చిపోలేని మధురమైన ఏడాది 2011. మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్సీలో భారత జట్టు వన్డే వరల్డ్ కప్ గెలిచి, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ చిరకాల కోరికను నెరవేర్చిన ఏడాది అది.. కానీ దీనికి సరిగ్గా ఒక ఏడాది ముందు, అంటే 2010లో స్పెయిన్ జట్టు ఫిఫా వరల్డ్ కప్ ని సొంతం చేసుకుంది. స్పెయిన్ ఫుట్‌బాల్ కప్ కొట్టిన తర్వాత ఏడాదే టీమిండియా క్రికెట్‌లో వరల్డ్ కప్ గెలిచాం.. కాబట్టి, ఈ సెంటిమెంట్‌కు బలమైన పునాది వేసింది.

**2022 అర్జెంటీనా విజయం..- 2023లో గుండెకోత:**
ఇక ఈ సెంటిమెంట్‌ను ఫ్యాన్స్ మరింత బలంగా నమ్మడానికి మరో కారణం కూడా ఉంది. అదేనండి

బాబోయ్ 2023 వరల్డ్ కప్ ఫలితం.. లియోనల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా జట్టు 2022లో ఫిఫా వరల్డ్ కప్ గెలిచింది. కానీ, ఆ మరుసటి ఏడాది జరిగిన 2023 వన్డే ప్రపంచ కప్‌లో రోహిత్ శర్మ సారథ్యంలోని ఇండియన్ టీమ్ అద్భుతంగా ఆడి ఫైనల్ కి వెళ్లింది. కానీ దురదృష్టవశాత్తూ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఘోరంగా ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. అర్జెంటీనా గెలిచిన తర్వాత ఏడాది భారత్‌కు నిరాశే ఎదురవడంతో ఫ్యాన్స్ ఈ లాజిక్‌ను నమ్ముతున్నారు.

**2026 ఫైనల్ ఫలితం.. 2027 వన్డే వరల్డ్ కప్ ఇండియాదేనా:**
ప్రస్తుతం 2026లో జరుగుతున్న ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ ఫలితంపైనే భారత్ 2027 వన్డే వరల్డ్ కప్ భవిష్యత్తు ఆధారపడి ఉందని క్రికెట్ ఫ్యాన్స్ లెక్కలేసుకుంటున్నారు. ఒకవేళ ఈసారి అర్జెంటీనా గెలిస్తే, భారత్ 2027 వన్డే వరల్డ్ కప్ ఫైనల్ వరకు వెళ్లి మళ్లీ ఓడిపోతుందని టెన్షన్ పడుతున్నారు. అదే స్పెయిన్ కానీ గెలిస్తే మాత్రం 2027 వన్డే ప్రపంచ కప్ ఖచ్చితంగా మనమే గెలుస్తామని అభిమానులు బలంగా నమ్ముతున్నారు. ఈ ముచ్చట వినడానికి చాలా విచిత్రంగా ఉన్నప్పటికీ, స్పోర్ట్స్‌లో సెంటిమెంట్స్‌కు ఉండే క్రేజ్ వేరబ్బా..

# బేబీ బంప్‌తో స్టన్నింగ్ లుక్... రెడ్ బీచ్ డ్రెస్‌లో ఆకట్టుకున్న ‘సామజవరగమన’ బ్యూటీ



దక్షిణాది చిత్రసీమలో దూసుకుపోతున్న యషికా ఆనంద్, ఎరుపు రంగు గ్లామరస్ లుక్‌లో మెరిసిపోతోంది.



తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సామజవరగమన’ సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మలయాళ ముద్దుగుమ్మ రెబా మోనికా జాన్. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, సహజమైన నవ్వుతో సౌత్ ఇండియాలో ప్రత్యేకమైన క్రేజ్ సంపాదించుకున్న ఈ నటి, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. థాయిలాండ్‌లోని ఫుకెట్ బీచ్ రిసార్ట్‌లో రెడ్ కలర్ ప్రింటెడ్ మ్యాక్సీ డ్రెస్ ధరించి, తన బేబీ బంప్‌ను చూపిస్తూ ఆమె దిగిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి.

**పెళ్లి తర్వాత కూడా కెరీర్‌లో దూకుడు:**
మోడలింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న రెబా మోనికా జాన్ ట్రెడిషనల్ శారీస్ అయినా, మోడ్రన్ వెస్ట్రన్ వేర్ అయినా చాలా స్టైలిష్‌గా క్యారీ చేస్తుంది. ఈమె 2022 జనవరిలో తన చిరకాల మిత్రుడు జోమోన్ జోసెఫ్‌ను వివాహం చేసుకున్నారు. ఇక ఇక పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో ఎంతో యాక్టివ్‌గా ఉంటున్న ఈ బ్యూటీ, తెలుగులో సామజవరగమన తో పాటు మృత్యుంజయ్, మ్యాడ్ స్క్వేర్ వంటి క్రేజీ చిత్రాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది.

**బీచ్ లో రెడ్ డ్రెస్ హంగామా - ప్రెగ్నెన్సీ గ్లో:**
ప్రస్తుతం ప్రెగ్నెంట్‌గా ఉన్న రెబా, ద నాకా ఫుకెట్ రిసార్ట్‌లో వెకేషన్‌ను ఫుల్‌గా ఎంజాయ్ చేస్తోంది. అక్కడ బీచ్ ఒడ్డున వైబ్రెంట్ రెడ్ ప్రింటెడ్ స్ట్రాపీ మ్యాక్సీ బీచ్ డ్రెస్ ధరించి సరికొత్తగా ఫోటోలకు పోజులిచ్చింది. హై లెగ్ స్లిట్ ఉన్న ఈ డ్రెస్‌లో ఆమె తన మెటర్నిటీ లుక్‌ను ఎంతో కాన్ఫిడెంట్‌గా ప్రదర్శించింది. ఇక ఇక ఆమె ముఖంలో కనిపిస్తున్న ప్రెగ్నెన్సీ గ్లో చూసి అభిమానులు మురిసిపోతున్నారు. “ప్రెగ్నెన్సీ గ్లో అనేది నిజంగానే అద్భుతం” అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

**సమయం ఎంత వేగంగా గడిచిపోయింది:**
తన బేబీ బంప్ ఫోటోలను షేర్ చేస్తూ రెబా మోనికా జాన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన క్యాప్షన్ కూడా అందరినీ ఆకట్టుకుంటోంది. “సమయం ఇంత వేగంగా ఎలా గడిచిపోయింది? బేబీ బంప్‌తో గడిపే చివరి కొన్ని రోజులు ఇవి” అంటూ ఆమె ఎమోషనల్ అయ్యింది. ఇక త్వరలోనే మాతృత్వపు తీపి అనుభూతిని పొందబోతున్న తరుణంలో ఆమె ముఖంలోని ఆనందం ఈ ఫోటోలలో స్పష్టంగా కనిపిస్తోంది. రెబా షేర్ చేసిన ఈ బ్యూటిఫుల్ ఫోటోలు చూసి ఫ్యాన్స్, సెలబ్రిటీలు ఆమెకు పెద్ద ఎత్తున కంగ్రాట్స్ చెప్తున్నారు. ఈ ప్రెగ్నెన్సీ సమయంలో జాగ్రత్తగా ఉండాలంటూ అభిమానులు కామెంట్ల సెక్షన్‌లో ప్రేమను కురిపిస్తున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో రాచరికపు అందాన్ని వలకబోసే ఈ సామజవరగమన బ్యూటీ, ఇప్పుడు ప్రెగ్నెన్సీ లుక్‌లోనూ అంతే స్టైలిష్‌గా మరియు క్యూట్‌గా కనిపిస్తూ అందరి హృదయాలను గెలుచుకుంటోంది.



యోధురాలి తరహా బంగారు వర్ణపు వేషధారణలో జియోర్జియా ఆండ్రియాని మెరుపులు

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965